www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నిర్మల్
20
గురువారం 17 ఆగస్టు 2017



రూ. వెయ్యి కోట్లతో మైక్రో ఇరిగేషన్‌అభివృద్ధి



మాట్లాడుతున్న హార్టికల్చర్ కమిషనర్ వెంకటరాంరెడ్డి

- మైక్రో ఇరిగేషన్ అభివృద్ధికి తెలంగాణ సర్కార్ ప్రణాళికా బద్ధమైన చర్యలు
- వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడమే కారణం
- సాగుబడిలో ఇబ్బందులు తొలగించేందుకు.. మైక్రో ఇరిగేషన్ ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు
- బుధవారం భైంసా పట్టణంలో హార్టికల్చర్ కమిషనర్ వెంకట రాంరెడ్డి

9



కొత్త జిల్లాల్లో గోల్కొండ షోరూంలు







- చేనేత వస్త్రాల అమ్మకాలకు ప్రాధాన్యం
- నిర్మల్ కొయ్య బొమ్మలకు చోటు
- ఇతర చేతి వృత్తులకు అవకాశం
- విక్రయ శాలల కోసం ఒక్కో జిల్లాకు రూ. 2కోట్లు
- అమెజాన్ సంస్థ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్
- వ్యాపార , వాణిజ్య రంగాలతో ఉపాధి అవకాశాల విస్తరణ

చేతితో తయారయ్యే కళాకృతులు, చేనేత వస్త్రాలను విక్రయించేందుకు ఇంతవరకు ఉన్న 'లేపాక్షి ' సంస్థ స్థానంలో తెలంగాణ సర్కారు గోల్కొండ పేరిట కొత్త చేతి వృత్తుల వాణిజ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రతీ జిల్లా కేంద్రంలో షోరూంను ఏర్పాటు చేయనున్నారు.ముఖ్యంగా నిర్మల్‌లో ఏర్పాటు చేయబోయే షోరూం ప్రాధాన్యతను సంతరించుకోబోతుంది. ఇక్కడ గోల్కొండ షోరూంలో చేనేత వస్త్రాలతో పాటు ఇక్కడే తయారయ్యే కొయ్య బొమ్మలను విక్రయించను న్నారు. ఈ షోరూం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లను మంజూరు చేసింది. అంతర్జాతీయంగా అమ్మకాలను చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమెజాన్‌తో ఎంఓయూ కూడా కుదుర్చుకుంది. ఆంధ్రజ్యోతి, నిర్మల్

8



ఉపాధి హామీలో ఇక శాశ్వత నిర్మాణ పనులు

జామ్‌లో నిర్మించిన వంట గది

- ఇంత వరకూ మట్టి పనులకే పరిమితం
- 60 శాతం కూలీలకు, 40 మెటీరియల్స్‌కు
- ఇక శాశ్వత నిర్మాణాలపై దృష్టి
- పశువుల తొట్లు, షెడ్‌ల నిర్మాణం
- తీరనున్న వంట గదుల కొరత
- అనువైన చోట్ల సేద్యపు బావులు
- పంచాయతీ రాజ్ సహకారంతో మురికి కాలువలు, రోడ్లు

8

మీజిల్స్, రుబెల్లా టీకాల పంపిణీకి సర్వం సిద్ధం

- భైంసా డివిజన్‌లో 73,573 లబ్ధిదారులు
- 871 కేంద్రాల ఏర్పాటు
- 65 మంది సిబ్బంది నియామకం
- పూర్తయిన వ్యాక్సినేషన్ సరఫరా
- 3 విడతలుగా టీకాల అందజేత
- ప్రతీ పీహెచ్‌సీలో ఏఈఎఫ్ఐ కేంద్రాల ఏర్పాటు

9

డిపోలో సమస్యలు పరిష్కరించాలని

ఆర్టీసీ కార్మికుల ధర్నా


9

- నిర్మల్ డిపోలో నెలకొన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా
- మహిళా కండక్టర్ పట్ల అసిస్టెంట్ మేనేజర్ అనుసరిస్తున్న దురుసు ప్రవర్తనను మార్చుకోవాలని డిమాండ్
- నెలవారీ సమస్యలు తలెత్తిన సమయంలో అత్యవసర సెలవులు ఇవ్వాలని నినాదాలు

ఉన్నత విద్యకు రుణాలు

● పేద ప్రతిభావంతులకు వరం విద్యాలక్ష్మి పథకం
● ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్రం

మీకోసం



విద్యాలక్ష్మి పథకం లోగో

మంచిర్యాల టౌన్ : కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ 2015-16 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో విద్యాలక్ష్మి పథకం ప్రవేశపెట్టారు. దీన్ని గతేడాది ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే ఉండాల్సిన అర్హతలు, విధి విధానాలు మీకోసం..

ప్రత్యేక పోర్టల్ ద్వారా దరఖాస్తులు..

బ్యాంక్ రుణాలను పొందాలనుకునే వారు http://w.w.w.vidhyalaxmi.com.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. మొదటి పేజీలో రిజిస్టర్ బాక్స్‌ను క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరోబాక్స్ వస్తుంది. అందులో అడిగిన పేరు, ఇతర వివరాలను నమోదు చేయాలి. దాని ఆధారంగా మరో బాక్స్ తెరవాలి. అందులో ఫిలప్ సింగిల్ ఫాం అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి అడిగిన వివరాలను అందించాలి. ఆ తర్వాత మూడో బాక్స్‌ను తెరిచి అప్లై మల్టిపుల్ బాక్స్‌ను క్లిక్ చేయాలి. ఏ బ్యాంక్ ద్వారా రుణం పొందాలనుకుంటున్నారో సంబంధిత బ్యాంక్ దరఖాస్తు పూర్తి చేసుకుని ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేసుకోవచ్చు. తర్వాత దరఖాస్తు ఏ స్థితిలో ఉంది. రుణం ఎప్పుడు వస్తుంది. ఏ మేరకు ఇస్తారు. అన్న వివరాలను కూడా ఎప్పటికప్పుడు ఈ సైట్‌లోనే మీ పాస్‌వర్డ్ ఆధారంగా తెలుసుకునే వీలుంటుంది. విద్యార్థి విద్యకు రుణాలిచ్చేవాటిలో ఎస్‌బీఐ, సెంట్రల్ బ్యాంక్, కెనరా, యూనియన్, ఆంధ్రా, ఐడీబీఐ, యూబీఐ, పంజాబ్ నేషనల్, బీవోబీ, హెచ్‌డీఎఫ్‌సీ, దేనా తదితర బ్యాంకులున్నాయి.

ఆర్థిక మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో...

విద్యా రుణాలందించే ఈ ప్రత్యేక పోర్టల్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఉన్నత విద్య మానవ వనరుల అభివృద్ధి శాఖలు, భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) సంయుక్త భాగస్వామ్యంతో పర్యవేక్షిస్తారు. రూ.4.5లక్షల ఆదాయం ఉన్న కుటుంబ దేశీయ విద్య రుణం తీసుకుంటే వడ్డీని ప్రభుత్వం భరిస్తుంది. రూ.7.5 లక్షల వరకు 10 శాతం, ఆపైన దాటితే 10.75 శాతం వడ్డీ విధిస్తారు. దేశీయ విద్యకు రూ.10 లక్షల వరకు ఇస్తారు. రూ.4 లక్షల వరకు ఏ విధమైన సెక్యూరిటీ లేకుండానే రుణం ఇస్తారు. ఆ మొత్తం దాటితే రూ.7.5 లక్షల వరకు మూడో వ్యక్తి నుంచి వ్యక్తిగత హామీ తీసుకుంటారు. అది కూడా దాటితే ఆస్తులను హామీగా ఇవ్వాల్సి ఉంటుంది. విదేశీ విద్యకు రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఇస్తారు. ఎస్‌బీఐవో ఎంపిక చేసిన బ్రాంచ్ లు హార్వర్డ్ విశ్వవిద్యాలయం వంటి సంస్థల్లో సీట్లు వచ్చిన వారికి రూ.1.5 కోట్ల వరకు రుణమిచ్చే అవకాశం ఉంది.


ధ్రువీకరణ పత్రాలు ఉండాలి...

విద్యార్థి చదివిన విద్యా సంస్థ నుంచి బదిలీ ధ్రువపత్రం, మార్కుల జాబితాలు. ఇప్పటి వరకు పొందిన ఉపకార వేతన వివరాల పత్రాలు. ఉన్నత విద్య ర్యాంక్ కార్డు, ప్రవేశ అనుమతి పత్రాలు ఉండాలి. అలాగే చేయాల్సిన కోర్సు ఫీజుల అంచనా వివరాల పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

మీకోసం

'పీసీ' వేగం పుంజుకోవాలా..?





● ఈ చిట్కాలు పాటిస్తే కంప్యూటర్ పనితీరు మెరుగు

మంచిర్యాల టౌన్ : ఈ రోజుల్లో కంప్యూటర్ లేకుంటే ఎలాంటి పనులు కావడం లేదు. నిత్యం మనం చేసుకునే పనులు కంప్యూటర్‌తో ముడిపడి ఉంటాయి. ఎలాంటి పనులు చేసుకోవాలన్నా పర్సనల్ కంప్యూటర్(పీసీ)కు పని చెప్పాల్సిందే. అత్యవసరంలో కంప్యూటర్‌లు మొరాయిస్తే అనుకున్న సమయంలో పనులు కావు. చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే కంప్యూటర్ పనితీరును మరింత వేగవంతం చేసుకోవచ్చు. కొన్ని కొన్ని సందర్భాల్లో కంప్యూటర్‌లోని ఫైల్స్, ఫోల్డర్లను ఓపెన్ చేస్తున్న సమయంలో పనితీరు తగ్గిపోయినట్లు కనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో పనులు తాత్కాలికంగా ఆగిపోతుంటాయి. మరి నిత్యం ఎన్నో రకాల పనులు చేసే కంప్యూటర్ పనితీరును మరింత వేగంగా చేసుకోవడానికి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

కంప్యూటర్ వేగం పెంచడానికి ఇలా చేయండి...

● పర్సనల్ కంప్యూటర్‌లో ఒకే ఫైల్ ఒకటి కంటే ఎక్కువ చోట్ల సేవ్ అయిన సందర్భాల్లో పనితీరు కొంత మందగిస్తుంది. ఫొటోలు, వీడియోలతో పాటు ఇతర ఫైళ్లు కూడా ఎక్కువ చోట్ల ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాంటి వాటిని గుర్తించి డిలీట్ చేయడం ద్వారా హార్డ్‌డిస్క్‌లో మరింత స్పేస్‌ను పెంచుకునే అవకాశముంది. ప్రధానంగా యాప్స్, ఇతర సాఫ్ట్‌వేర్ మూలంగా ఏర్పడే జంక్‌ఫైల్స్‌లో 'టెంప రరీ' డాటా రోజురోజుకు పెరిగిపోతూ ఉంటుంది. పీసీలో ఈ ఫైల్స్ రకా రకాల 'లొకేషన్'లలో సేవ్ అవుతూ ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటే పీసీ వేగం ఆటోమెటిక్‌గా పెరిగిపోతుంది. ఇందుకోసం సిస్టమ్‌లోని 'డిస్క్ క్లీనప్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. 'మై కంప్యూటర్'లోని డిస్క్‌లలో ఏదైనా ఒక డిస్క్‌పై మౌస్ ద్వారా రైట్ క్లిక్ చేస్తే 'డిస్క్ క్లీనప్' ఆప్షన్‌ను మనం గమనించవచ్చు.



● కొనుగోలు చేసిన పీసీలో ఎన్నో రకాల అప్లికేషన్లు ఉంటాయి. ఇందులో అవసరమున్నవి కొన్ని, అవసరం లేనివి మరికొన్ని ఉంటాయి. అయితే అవసరం లేని అప్లికేషన్లను సిస్టమ్ నుంచి తొలగించడం ద్వారా కంప్యూటర్ స్పీడ్‌ను పెంచుకోవచ్చు. పీసీలో అవసరం లేని అప్లికేషన్లలను ఎప్పటికప్పుడు తొలగిస్తే ఫలితముంటుంది.

● కంప్యూటర్‌లో ఉన్న డ్రైవ్‌లే కాకుండా 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లను వినియోగించడం ద్వారా స్టోరేజీపై పడుతున్న భారాన్ని అడ్డుకోవచ్చు. పీసీ స్టోరేజీని పెంచుకోవడంలో ఇదొక మార్గంగా చెప్పవచ్చు. ఇందుకు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'ను ఎంచుకోవాలి. ప్రధానంగా 'డ్రాప్‌బాక్స్', మైక్రోసాఫ్ట్ వన్‌డ్రైవ్', 'గూగుల్ డ్రైవ్'లాంటివి అందుబాటులో ఉన్నాయి. ఇవి 'క్లౌడ్ స్టోరేజ్' సదుపాయాన్ని సైతం కల్పిస్తున్నాయి. కంప్యూటర్‌లోని ఇంటర్నల్ డ్రైవ్‌లో గల డాటాను ఎప్పటికప్పుడు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లోకి మార్చుకుంటే డిస్క్‌లోని స్పేస్ ఫ్రీ అవడంతో కంప్యూటర్ వేగం మరింత పెరుగుతుంది.

● ఇంటర్నెట్‌లో లభించే 'క్లీన్ మై పీసీ' అను అప్లికేషన్ ద్వారా పీసీ వేగాన్ని కొంతమేర పెంచుకోవచ్చు. ఇది కంప్యూటర్ వేగాన్ని పెంచడానికి సహకరిస్తుంది. ఈ అప్లికేషన్‌లో ఉన్న రకరకాల 'సిస్టమ్ క్లీనింగ్ టూల్స్'ను వినియోగించి క్లీన్ చేస్తుంది. తద్వారా కంప్యూటర్ వేగం పుంజుకుంటుంది.

● కొన్ని సందర్భాల్లో 'డిస్క్ క్లీన్' చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం ఉండకపోవచ్చు. అయితే 'హార్డ్‌డిస్క్'లో స్టోర్ అయి ఉన్న 'బ్యాడ్‌సెక్టార్స్'ను డిలీట్ చేయడం ద్వారా కంప్యూటర్ వేగం పెరుగుతుంది. ఇందుకు కంప్యూటర్‌లోని డెస్క్‌టాప్‌పై గల 'మై కంప్యూటర్' ఆప్షన్‌పై డబుల్ క్లిక్ చేయాలి. తరువాత ఏ డ్రైవ్‌లో ఎర్రర్స్ ఉన్నాయో చెక్‌చేసుకోవాలి. ఇందుకు సదరు డ్రైవ్‌ను ఎంచుకొని రైట్ క్లిక్ చేసి 'ప్రాపర్టీస్'లోకి వెళ్లాలి. ఇప్పుడు ఒక బాక్స్ డిస్‌ప్లే అవుతుంది. అందులో గల టూల్స్ ఆప్షన్‌ను ఎంచుకొని 'చెక్ నౌ' బటన్‌పై క్లిక్ చేయాలి. తరువాత మరో బాక్స్ డిస్‌ప్లే అవుతుంది. ఇందులో ఉన్న ఆప్షన్‌లలో 'ఆటోమెటికల్లీ ఫిక్స్ ఫైల్ సిస్టమ్ ఎర్రర్స్'ను ఎంచుకోవాలి.

● కంప్యూటర్‌లో సేవ్ అయ్యే 'టెంపరరీ ఇంటర్నల్ ఫైల్స్'ను ఎప్పటికప్పుడు డిలీట్ చేసుకోవాలి. ఇందుకు కంప్యూటర్‌లోని 'స్టార్ట్' బటన్‌ను క్లిక్ చేసి 'రన్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇందులో 'టెంప్' అని ఇంగ్లీష్‌లో టైప్ చేసి ఎంటర్ నొక్కాలి. అప్పుడు మనకు తెలియని కొన్ని 'టెంపరరీ ఇంటర్నల్ ఫైల్స్' డిస్‌ప్లే అవుతాయి. వాటిని సెలక్ట్ చేసి డిలీట్ చేసేయాలి.

● పర్సనల్ కంప్యూటర్‌లో ఫైల్ సెర్చ్ చేయడానికి కొంత సమయం పడుతుంది. దీనికి 'డిస్క్ ఫ్రాగ్మెంటేషన్' కారణమవుతుంది. ఫైల్స్‌ను వెతకడానికి హార్డ్‌డిస్క్ మొత్తం సెర్చ్ చేయాల్సి ఉంటుంది. ఫలితంగా సమయం వృధా అవుతుంది. ఇలాంటప్పుడు 'డిస్క్ డిఫ్రాగ్మెంటర్' ఆప్షన్ మనకు ఉపయోగపడుతుంది. ఇందుకోసం ముందుగా 'స్టార్ట్' ఆప్షన్‌లోని 'ప్రోగ్రామ్స్‌ను ఓపెన్ చేయాలి. ఇందులో గల 'యాక్సెసిరిస్'లోని 'సిస్టమ్ టూల్స్'లో గల 'డిస్క్ డిఫ్రాగ్మెంటర్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇప్పుడు వచ్చిన డైలాగ్ బాక్స్‌ని సెలెక్ట్ చేసుకొని 'కాన్ఫిగర్ షెడ్యూల్ బటన్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 'డీ ఫ్రాగ్మెంట్' చేయాలనుకుంటున్న డ్రైవ్స్‌ని సెలెక్ట్ చేయాలి. తరువాత 'ఎనలైజ్ డిస్క్' బటన్‌పై క్లిక్ చేయాలి. తరువాత మరో డైలాగ్ బాక్స్ ఓపెన్ అవుతుంది. ఇప్పుడు ఇందులో ఉన్న 'డిఫ్రాగ్మెంట్ డిస్క్' బటన్‌ను ఎంచుకోవాలి. ఇలా ఎంచుకున్న తరువాత మనకు రిజల్ట్ కనిపిస్తుంది. తరువాత రిపోర్టు చూడాలంటే 'వ్యూ రిపోర్టు' ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా కంప్యూటర్ పనితీరుపై ఎలాంటి భారం పడకుండా ఉంటుంది.

ఆధ్యాత్మికం

గూడెం ఆలయంలో ప్రత్యేక పూజలు..


కొలువు దీరిన శ్రీసత్యదేవుడు

● గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సుప్రభాతం, ఆరాధన, బాలబోగము.

● ఉదయం 7 గంటల నుంచి ధర్మ దర్శనము, స్వామి తీర్థప్రసాదం వితరణ అర్చకుల పూజలు

● మధ్యాహ్నం 12:15 గంటలకు స్వామివారికి మహా నివేదన, హారతి, మంత్రపుష్పం.

● గూడెం దేవస్థానాన్ని మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు మూసివేస్తారు.

● ఆ సమయంలో ఆలయ కౌంటర్లు, కార్యాలయాలు కూడా మూసి ఉంటాయి.

● సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారికి బోగము, హారతి, మంత్రపుష్ప నివేదన.

● రాత్రి 7 గంటల సమయంలో గూడెం ప్రధానాలయం మూసివేస్తారు.

శ్రీసత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఇలా..

● శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాల మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం 11గంటలకు, మూడో బ్యాచ్ సాయంత్రం 3.30 గంటల నుంచి నిర్వహిస్తారు. వ్రతం ఆచరించే భక్తులు పూలు పండ్లు, కొబ్బరికాయలు, మంగళహరతిప్లేటు, మాణిక్యాలు, చెంబు, గ్లాస్‌ను వెంటతెచ్చుకోవాల్సి ఉంటుంది. మిగిలిన సామూహిక వ్రత పూజా సామగ్రి ఆలయంలోనే అందజేస్తారు.

Employee Voice

ఉద్యోగి వాయిస్

కారోబార్‌లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

● నాగుల శ్రీధర్, కారోబార్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

దండేపల్లి : ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రస్తుతం నెలకు కేవలం 2వేల వేతనమే చెల్లిస్తున్నారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతున్నది. మా పరిస్థితి అధ్వానంగా మారింది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా ఉన్నది. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి, కనీస వేతనాన్ని నెలకు రూ.12వేలకు పెంచాలి. సర్పంచు మారినా కారోబార్లను మార్చకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కారోబార్లలందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. మా న్యాయమైన డిమాండ్లను ఇప్పటికైనా పరిష్కరించాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం.



మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

● మహిళా సంఘాల నాయకుల డిమాండ్ ● రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం విక్రయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా బస్టాండ్ ఎదుట రహదారిపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. వీటిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. దీంతో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాని ఆరోపించారు. సీఎం కేసీఆర్ మద్యం అమ్మకాలకు ప్రాధాన్యతను ఇవ్వడం సిగ్గుచేటన్నారు. బంగారు తెలంగాణ చేస్తామంటూ మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఎక్సైజ్ అధికారుల తనిఖీలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయన్నారు. ఎక్సైజ్ పోలీసులే మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నరని మండిపడ్డారు. అంతేకాకుండ ఉదయం నుంచే అమ్మకాలు సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం గ్రామాల్లో, వాడల్లో బడులు, గుడులు, ఆసుపత్రులు తేడాలేకుండా వెలిసిన మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇందులో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి, ఫైద్వా నాయకురాలు మయూరి ఖాన్, పీడీఎస్‌యూ నాయకురాలు కళావతి, మహిళా సంఘాల నాయకులు లంక జమున, రాజకుమారి, అమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

జీర్ణకోశ వ్యాధులపై ఏథెన్స్‌లో మేధోమధనం

● నిర్మల్ డాక్టర్‌కు దక్కిన అరుదైన అవకాశం


సదస్సుకు హాజరైన నిర్మల్‌కు చెందిన డాక్టర్ జి. ప్రశాంత్

నిర్మల్‌స్పోర్ట్స్ : గ్రీస్ దేశ రాజధాని ఏథెన్స్‌లో ఈ నెల 13 నుంచి 16 వరకు జరిగిన ఇండో - గ్రీస్ గ్యాస్ట్రో సదస్సుకు నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, సర్జన్ డాక్టర్ గోపు ప్రశాంత్ హాజరయ్యారు. ఏథెన్స్‌లోని నేషనల్ అండ్ కపోడి స్ట్రేయిన్ యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి కేవలం ఇద్దరు వైద్యులకు మాత్రమే ఆహ్వానం అందగా అందులో డాక్టర్ ప్రశాంత్‌కు చోటు దక్కడం విశేషం. కాగా ఈ సదస్సులో జీర్ణకోశ వ్యాధులపై సుదీర్ఘంగా మేధోమధనం జరిగినట్లు ఏథెన్స్ నుంచి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంభవిస్తున్న జీర్ణకోశ వ్యాధులపైనా గిరిజన ప్రాంతాల్లోని వ్యాధుల పరిస్థితులపైనా ఈ సదస్సులో తాను ఉపన్యాసించినట్లు డాక్టర్ ప్రశాంత్ తెలిపారు.

చైల్డ్‌హోమ్‌లో బాలిక ఆత్మహత్య

● ప్రియుడి తల్లిదండ్రుల వేధింపులే కారణమని సూసైడ్ నోట్


సూర్యవంశీ లక్ష్మీ (ఫైల్)

భైంసారూరల్ : హైదరాబాద్ అల్విన్ కాలనీ కూకట్‌పల్లిలోని శిశు సంరక్షణ గృహంలో బుధవారం సూర్యవంశీ లక్ష్మీ(16) అనే బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై భైంసా ఎస్సై తిరుపతిని వివరణ కోరగా లక్ష్మీ ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా భైంసా మండలం గుండేగాం గ్రామానికి చెందిన సూర్యవంశీ లక్ష్మీ అదే గ్రామానికి చెందిన గాయక్వాడ్ సతీష్‌ను ప్రేమించుకున్నారు. తమ ప్రేమకు తల్లిదండ్రులు అంగీకరించరని భావించి నెల రోజుల క్రితం ఇరువురు కలసి ఇంటినుంచి పారిపోయారు. ఈ మేరకు లక్ష్మీ కుటుంబీకులు గత నెల జూలై 28న ఫిర్యాదు చేశారు. దీంతో గయక్వాడ్ సతీష్‌పై సెక్షన్ 376 కింద కేసు నమోదు చేశారు. బాలికను కోర్టులో ప్ర వేశపెట్టగా ఆమె మైనర్ అయినా తల్లిదండ్రులతో వెళ్లనని చెప్పింది. దీంతో కోర్టు లక్ష్మీని చైల్డ్‌హోమ్‌కు తరలించాలని పోలీసులకు సూచించింది. ఈ మేరకు ఇక్కడి పోలీసులు 10 రోజుల క్రితం కూకట్‌పల్లిలోని అల్విన్ కాలనీ శిశు సంరక్షణ గృహానికి తరలించారు. ఈ క్రమంలో ప్రియుడి తల్లిదండ్రులు తరుచూ లక్ష్మీకి ఫోన్‌చేస్తూ.. నీవల్లే మాకుమారుడు జీవితం నాశనమవుతుందని వాడిని మరచిపోవాలని వాడిపై కేసు లేకుండా చూడాలని తరుచూ వేధిస్తున్నట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీ సూసైడ్‌నోట్ రాసి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపారు. ఈ మేరకు తల్లి ఫిర్యాదుతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

పెంబి : నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని మందపల్లి గ్రామంలో అడవి పందులు నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో పందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అడవి పందుల ద్వారా తమ తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను తినడం కంటే పంటను నాశనం చేస్తున్నాయని మందపల్లికి చెందిన రైతు ఆశన్న తెలిపారు. ఆయన రెండు ఎకరాల పసుపు, మొక్కజొన్న పంటలపై పందులు దాడి చేసి ఎక రానికి పైగా నష్ట పరిచాయి. అటవీ శాఖ అధికారులు పంట నష్టాన్ని సర్వే చేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు. పెంబి మండలంలోని పంటలపై అడవి పందులు దాడి చేసి నష్టపరుస్తున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు.


ధ్వంసమైన మొక్కజొన్న పంట

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత


స్వాధీనం చేసుకున్న బాటిళ్లు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని పాటన్‌బోరి నుంచి మహాలక్ష్మీవాడలో విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్న దేశీదారును ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు బుధవారం స్థానిక సూపరింటెండ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న దేశీదారును, నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా బాసర దర్బాబాద్‌కు చెందిన పులి రామ్, చందర్‌లు మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారును తీసుకువచ్చి మహాలక్ష్మీవాడలో రోజు విక్రయించుకొని తమ ఊరికి వెళ్తాడని తెలిపారు. పక్కా సమాచారంతో రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నామని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 130 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో హెడ్‌కానిస్టేబుళ్లు హింతియాజ్, రషీద్‌ఖాన్, జమీర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

సారంగాపూర్ : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామం నుంచి మహారాష్ట్రలోని షివిని గ్రామానికి ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జామ్ గ్రామం నుంచి షివిని గ్రామానికి ఏపీ 01వీ 3124 అనే ఆటో లో పది క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా నిర్మల్ - స్వర్ణ రహదారిపై పట్టుకొని ఆటో డ్రైవర్ విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మామడలో బాలికను అపహరించేందుకు యత్నం

మామడ : నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రానికి చెందిన బాలికను అపహరించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బాలికను జాకీర్ అనే వ్యక్తి కారులో తీసుకువెళుతున్నప్పుడు గమనించిన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇది గమనించిన జాకీర్ తిరిగి బాలికను యథా స్థానానికి తీసుకువచ్చి వదిలిపెట్టాడు. సహకరించిన అఫ్రోజ్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

నిర్మల్‌టౌన్: సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం డీఈవో ప్రణీతకు వినతి పత్రాన్ని అందించారు. సర్వా శిక్షా అభియాన్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నా మన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించా లని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శ్రావణ్ కుమార్, గజేంధర్, స్పందన, సరిత తదితరులున్నారు.

'సెర్ఫ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'



రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: జాతీయ గ్రామీణ నిరుపేద పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సెర్ఫ్ ఉద్యోగులు రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో మాత్రం జాప్యం చేస్తుందని ఉద్యోగుల సంఘం నాయకులు శివ ప్రసాద్ అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య కార్డులను అందించాలని, మహిళా ఆపరేట్లకు ప్రసూతి సెలవులను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, మహేశ్, లక్ష్మణ్‌రావు, తదితరులున్నారు.

పందులను చంపొద్దని సీస కమ్మరుల వినతి

నిర్మల్‌టౌన్: సీస కమ్మరులకు జీవనోపాధి కల్పిస్తున్న పందులను ఎలాంటీ నోటీసులు లేకుండా మున్సిపల్ అధికారులు చంపివేస్తున్నారని సీసా కమ్మరుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. పందులను చంపకుండా తమకు అప్పగించాలన్నారు. ఎన్నోసంవత్సరాల నుంచి పందుల పెంపకమే జీవన వృత్తిగా జీవిస్తున్నామని, పందులను చంపడం వల్ల తాము జీవనోపాధి కోల్పోతామని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీసా కమ్మరి సంఘం నాయకులు రాంచరణ్ సింగ్, ప్రతాఫ్‌సింగ్, భగత్‌సింగ్, రాజేంధర్‌సింగ్, దీపక్ సింగ్, ఎల్లయ్య, పోశేట్టి తదితరులున్నారు.


నాగభూషణానికి ఉత్తమ సేవ పురస్కారం అందజేత



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న నాగ భూషణం

నిర్మల్‌టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్న మంచిర్యాల నాగభూషణంకు తిరుపతిలో ఉత్తమ సేవ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన చేపడుతున్న మనగుడి, శుభ ప్రధం కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావనలు చేపడుతున్నందున గాను స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తిరుపతి ఎఫ్‌ఎఫ్‌ఎ బాలాజీ, ప్రాజెక్టు కన్వీనర్ దామోదర్ నాయుడు ఆయన ఉత్తమ పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో రాజారం, చంద్రగుప్తా, పుండ్ర సుధాకర్ రెడ్డి, గొల్లపల్లి సత్యనారాయణ, గంగిరెడ్డి, ప్రవీణ్, రవి, ఎడిపెల్లి నరేంధర్, ముత్యం సంతోష్, అశోక్ నాగభూషణం ఉత్తమ సేవ పురస్కారం అందుకోవడం పట్ల వారు అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్ నిర్మల్



తిరుమల: నేనే రాజు నేనే మంత్రి

వేంకటేశ్: జయ జానకి నాయకా

నారాయణ: ఫిదా

వర్షకాల వ్యాధులతో మూగ జీవాలకు ప్రాణముప్పు



పచ్చి గడ్డిని మేస్తున్న గేదెలు

నిర్మల్‌రూరల్: పశువులు వర్షకాలంలో ఎక్కడ పడితే అక్కడ పచ్చి గడ్డిని మేయడం ద్వారా గడ్డిలోని క్రిమి కీటకాలు, బాక్టీరియా, ఇతర పరాన్న జీవులు గడ్డితో పాటు పశువుల జీర్ణకోశంలోకి చేరుతాయి. దీంతో మూగ జీవాలు వ్యాధుల భారిన పడే అవకాశం ఉంది. జబ్బవాపు, గాలి కుంటూ వ్యాధి గొర్రెలు, మేకల్లో లీవర్ ర్యాట్ వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువ. పశువులకు జబ్బ వాపు వ్యాధి సోకితే 48 గంటల్లో మృతి చెందుతాయి. దీనికి గల కారణం కలుషిత ఆహారం, కలుషిత వర్షపు నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగిపోయి పశువు యొక్క భుజం, తొడ కండరాల్లో మాంసం కుళ్లినట్లు శబ్ధం వస్తుంది. అదేవిధంగా కంటి నుంచి నీరు కారడం, గొంతు మేడపై వాపు రావడం, గురక శబ్ధంతో ఈ వ్యాధి బయట పడుతుంది. ఇదే కాకుండా గాలికుంటు వ్యాధి సోకి న పశువులు నాలుకపై, పళ్లు, చిగుళ్లపై బొబ్బలు ఏర్పడి పశువులు మేత మేయడం మానేస్తాయి. పశువుల యొక్క కాలి గిట్టెల మధ్య బొబ్బలు ఏర్పడి నడిచేందు కు చాలా ఇబ్బందులు ఏర్పడతాయి. గొర్రెలు, మేకలు కలుషిత ఆహారం తీసుకుంటే లీవర్ ర్యాట్ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా బాక్టీరియా వల్ల సోకుతుంది. దీంతో మేక, గొర్రె కాలేయం దెబ్బతిని అవి చనిపోయే ప్రమాదం ఉంటుంది. సరియైన సమయంలో రైతులు గమనించి పశువులకు, గొర్రెలు, మేకలకు సరియైన టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

● విశ్వనాథం, రిటైర్డ్ మెడికల్ అధికారి



వర్షకాలంలో పచ్చగడ్డిని పశువులు ఇష్టంగా మేస్తాయి. గడ్డితో పాటు వివిధ క్రిమి కీటకాలు, పరాన్న జీవులు పశువుల జీర్ణాశయానికి చేరడంతో వివిధ రకాలైన వ్యాధులను కలిగిస్తాయి. వర్షకాలంలో పశువులకు తప్పని సరిగా పరీక్షలు చేయించి టీకాలను వేయించాలి.

'రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి'



సోన్‌లో మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు నరేష్

దిలావర్‌పూర్: ప్రభుత్వ కార్యాలయాలను భీమన్న గుట్టపై కాకుండా నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రేపు నిర్మల్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిందని, విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పీసరి శైలేశ్వర్ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నిర్మల్‌లో సరిపడా స్థలం ఉన్నప్పటికీ అధికార టీఆర్‌ఎస్ పార్టీ నాయకుల సొంత భూముల విలువ పెంచుకునేందుకు పట్టణానికి దూరంగా ఉన్న భీమన్న గుట్టను ఎంచుకున్నారన్నారు. ఈ సమావేశంలో బిజెవైయం మండల కన్వీనర్ చెల్ల సాయి, సాయరెడ్డి తదితరులున్నారు.

సోన్: సమీకృత ప్రభుత్వ కార్యాలయాలను భీమన్న గుట్ట వద్ద నిర్మించడాన్ని వ్యతిరేఖిస్తూ రేపు చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు మోత్కుపల్లి నరేష్ అన్నారు. సోన్ మండల వ్యాపారులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం నిర్మల్ పట్టణంలో అనువైన స్థలాల మ్యాప్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మైనార్టీ నాయకులు హైమద్ కాన్, అద్వాల రాజశేఖర్, నవకాంత్ కుమార్ తదితరులున్నారు.

నిర్మల్‌రూరల్: భీమన్న గుట్టపై ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రేపు చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు గంగాధర్ అన్నారు. భీమన్న గుట్ట వద్ద ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఈ బంద్‌లో ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్, అయిండ్ల రమేష్, నరేష్, హరీష్, వినోద్, బుచ్చన్న, తదితరులున్నారు.

'ప్రజలకు అనువుగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలి'



రిలే దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌స్పోర్ట్స్: నిర్మల్ నడిబొడ్డున ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలను భీమన్న గుట్టపై నిర్మించడం విడ్డూరంగా ఉందని బీజేపీ గోదావరి కృష్ణ జలాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్ అన్నారు. బీజేపీ కార్యకర్తలు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. భీమన్న గుట్టను ప్రభుత్వ కార్యాలయాల కోసం ఎంపిక చేస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. స్వార్థప్రయోజనాలు మానీ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని హితవుపలికారు. రిలే దీక్షలో బుధవారం మామడ మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యన్న గారి భూమయ్య, మెడిసెమ్మ రాజు, రచ్చమల్లేష్, సుధాకర్, అంజు కుమార్‌రెడ్డి, టేకు ప్రకాష్, భూమన్న, సతీశ్, సత్యానంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఖానాపూర్: ఖానాపూర్ శివారులోని కొమరంభీం చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కాల్ గ్రామానికి చెందిన ఒక కుటుంబం షిరిడి వెళ్లి తిరిగి వస్తుండగా ఖానాపూర్ శివారులోని కొమరంభీం చౌరస్తా వద్ద ఎదురుగా లారీ వచ్చింది. దాంతో వారి ఇన్నోవా కారును డ్రైవర్ రోడ్డు దించాడు. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మట్టికుప్ప పైకి ఎక్కి బోల్తాపడింది. వాహనంలో ఉన్న భూమయ్య, రవి, స్వాతిలకు స్వల్ప గాయాలయ్యాయి. రిషిక్ అనే 10 సంవత్సరాల బాలుడి తలకు బలంగా దెబ్బతగిలింది. వారిని వెంటనే 108లో ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించమని ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో ఎటువంటీ కేసును నమోదు చెయలేదని ఖానాపూర్ ఏఎస్ఐ అశోక్‌గౌడ్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిషిక్

జీఎస్టీ రిటర్ను దాఖలు తేదీల ఖరారు

● సీటీవో గోవర్ధన్ పట్వారి

నిర్మల్‌కల్చరల్ : దేశవ్యాప్తంగా అమలవుతోన్న వస్తుసేవలపన్ను రిటర్ను దాఖలు తేదీలను వాణిజ్యపన్నుల శాఖ ఖరారు చేసింది. నిర్మల్ సిటీవో గోవర్ధన్ పట్వారి రిటర్ను గడువు తేదీలను ప్రకటించారు. జీఎస్టీ ఆర్-3బీ జూలై నెల రిటర్ను ఆగస్టు 20లోగా, ఆగస్టు నెల రిటర్ను సెప్టెంబర్ 20లోగా దాఖలు చేయాలన్నారు. జీఎస్టీ ఆర్-1 జూలై నెల రిటర్ను సెప్టెంబర్ 5లోగా, ఆగస్టు నెల రిటర్ను సెప్టెంబర్ 20లోగా దాఖలు చేయాలి జీఎస్టీఆర్-2 జూలై నెల రిటర్ను సెప్టెంబర్ 10లోగా ఆగ స్టు రిటర్ను సెప్టెంబర్ 25లోగా దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సాధారణ రిటర్నులు అక్టోబర్ నెలలో సీటీవో కార్యా లయంలో దాఖలు చేయాలి. జూలై నెలకు సంబంధించిన జీఎస్టీ ఆర్-3బిని తప్పని సరిగా ఈ నెల 20న సమ ర్పించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిటర్నులు దాఖలు చేసే వీలుందన్నారు. ఈ మేరకు ఆడిటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నేడు దళిత సంఘాల సమావేశం

నిర్మల్‌స్పోర్ట్స్: పట్టణంలోని టీఎన్‌జీవో సంఘ భవనంలో నేడు దళిత సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక నాయకులు తెలిపారు. నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యావాహిని పథకం కింద ఆరు పాఠశాలల ఎంపిక

ఖానాపూర్ రూరల్: మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 2017-18 సంవత్సరం ఏకలవ్య ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యావాహిని పథకం కింద ఎంపిక అయ్యాయని విద్యావాహిని సెగ్మెంట్ ఇంచార్జీ వాల్గొట్ కిషన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జీ ముత్యం తెలిపారు. మండలంలోని మస్కాపూర్ జడ్పీఎస్ఎస్, సుర్జాపూర్ జడ్పీఎస్ఎస్, సత్తన్‌పెల్లి జడ్పీఎస్ఎస్, పాత ఎల్లాపూర్ జడ్పీఎస్ఎస్, పట్టణంలోని జడ్పీఎస్ఎస్ బాలికల, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఎంపిక అయ్యాయి.

కరెంట్ షాక్ తగలడంతో వ్యక్తికి గాయాలు

నిర్మల్ అగ్రికల్చర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి(42) బుధవారం విద్యుద్ఘాతం కావడంతో గాయాల పాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగ కరెంట్ షాక్ కొట్టింది. చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఏరియా ఆసుపత్రికి గ్రామస్థులు తరలించారు.

దుబాయ్‌లో మృతి చెందిన మల్లాపూర్ వాసి


పోసులు(ఫైల్)

లక్ష్మణచాంద: మల్లాపూర్ గ్రామానికి చెందిన ఉడుత పోసులు(55) దుబాయ్‌లో మృతి చెందిన సంఘటన బుధవారం తెలిసింది. సర్పంచ్ కేశం శ్రీనివాస్ వివరాలు ప్రకారం పోసులు 15 సంవత్సరాలుగా ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతూ వస్తున్నాడు. దుబాయ్‌లో విధులు నిర్వహిస్తుండగానే అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి'


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీవో


లక్ష్మణచాంద: ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శకుంతల అన్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో రూ.9లక్షలతో శ్మశానవాటిక నిర్మాణ పనులను సర్పంచ్ అమరగొండ జ్యోతి లింగాగౌడ్ చేత బుధవారం భూమిపూజ చేయించారు. ఇతర గ్రామాలకు కూడా ఈ అవకాశం ఉందని, స్థలం కేటాయించి, గ్రామ పంచాయతీ తీర్మాణం చేస్తే నిర్మాణం చేపడతామని చెప్పారు. వ్యక్తి గతమైన పశువుల పాక, చెత్తను ఎరువుగా తయారు చేసే తొట్టి లాంటి నిర్మాణాలకు నిధులు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీయస్ ఏపీవో దివ్య, సర్పంచ్ అమరగొండ లింగాగౌడ్, పీఏసీఎస్ సభ్యులు కొండ్ర నరేష్ రెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

శ్మశానవాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన

ఖానాపూర్: మేజరు గ్రామపంచాయతీ పరిధిలో శ్మశానవాటికను నిర్మించేందుకు బుధవారం గోదావరి నది తీరంలో హిందూ ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. రూ.10 లక్షలు మంజూరైయ్యాయని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, ఖానాపూర్ మేజరు గ్రామ పంచాయితీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమటీ నాయకులు భవాని నర్సయ్య, రాజశేఖర్, చింతామణి, శ్రీనివాస కృష్ణస్వామి, టీఆర్ఎస్ నాయకులు కిషోర్, కొండాడి, గంగారావు, కొత్తపెల్లి సురేష్, గొర్రె గంగాధర్, తుమ్మనపెల్లి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులున్నారు.

'2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

మామడ: 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్‌లో గ్రామంలో దాదాపు 300 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువాను వేసి పార్టలోకి ఆయన ఆహ్వానించారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆధరణ పెరుగుతోందన్నారు. తెలంగాణను బాకీల తెలంగాణగా మారుస్తున్నారన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎయంసి చైర్మన్ తక్కల రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొండ్ర రాజారెడ్డి, బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డీనేటర్ గొంగురాజు, హరీష్‌రావు, నాయకులు వినాయక్ రెడ్డి, సత్యం చంద్రకాంత్, యూత్ అధ్యక్షులు కొండ్ర అశోక్, ఎంపీటీసీలు భోజన్న, పిఎసిఎస్ డైరెక్టర్లు లింగారెడ్డి, అరవింద్‌రావు, అయ్యన్నగారి పోశెట్టి, వంగ లింగారెడ్డి, నవీన్, నరేష్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఏలేటీ మహేశ్వర్ రెడ్డి

'కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలి'



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సునారికారి రాజేశ్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో తరగతులు సక్రమంగా కొనసాగడం లేదన్నారు. మూత్ర శాలలు, మరుగుదొడ్లకు ప్రహరీలు లేవని, దంతో ఇబ్బందులు తప్పట్లేదన్నారు. కళాశాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నర్సయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యా నాయకులు రాజు ప్రమోద్, మణీదీప్, విద్యార్థులు అంజనా, రాజేందర్, శ్రీజ, రాజమణి, లక్ష్మి తదితరులున్నారు.

రూబెల్లా టీకాపై అవగాహన ర్యాలీ

కడెం: మండల కేంద్రంలోని వైద్య సిబ్బంది మీజిల్స్, రూబెల్లా టీకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు చేపట్టే కార్యక్రమంలో 9 నెలల నుంచి 15సంవత్సరాల పిల్లలకు టీకాలు వేయాలన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగ పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ గోపాల్, కృష్ణవేణి, హెచ్ఈ జయలలిత, సిబ్బంది గంగరాజం, ఆశ వర్కరు గోదావరి, వరలక్ష్మి, మారుతి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి ప్రాథమికొన్నత పాఠశాలలో బుధవారం మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. 9 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ మీజిల్స్, రుబెల్లా టీకాలు వేయించాలని హెల్త్ అసిస్టెంట్ గాజుల రంజిత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సుశీల, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, మురళీ మనోహర్ రెడ్డి, రామాగౌడ్, ప్రతాఫ్ సింగ్, గంగయ్య, విజయలున్నారు.



కడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సుర్జాపూర్‌లో వైభవంగా గరుడ విగ్రహ ప్రతిష్ఠాపన


పూర్ణహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఖానాపూర్ రూరల్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర ఆలయంలో గరుడ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం గరుడ విగ్రహ ప్రతిష్ఠాపన ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. హోమం, పూర్ణహుతి, పుణ్యవచనం, మూలయంత్ర హవనాలు, యంత్రస్థాపన, అష్టదిగ్గాజలకు బలి, కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ జడ్పీటీసీ రాము, నాయకులు ప్రత్యేక పూజలు చేసి, ఆలయ అభివృద్ధికి రూ. 20వేలు అందజేసారు. రామునాయక్, రూ. 5వేలు ఇచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునితలింబాజి, ఉప సర్పంచ్, రాజన్న, ఆలయకమిటీ సభ్యులు బూసి నర్సయ్య, హరీష్, తిరుపతి, రాజేందర్, నాయకులు బూసి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దస్తూరాబాద్‌లో మాజీ ఎంపీ సుడిగాలి పర్యటన

దస్తూరాబాద్: మండలంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ బుధవారం పర్యటించారు. మండలంలోని బుట్టాపూర్ నుంచి దస్తూరాబాద్ వరకు కార్యకర్తలతో బైక్‌పై ర్యాలీగా వెళ్లారు. మండలంలోని రెవోజీపేట్‌లో సిమెంట్ ఇటుకల పరిశ్రమను ప్రారంభించి అనంతరం గ్రామంలోని సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుట్టాపూర్‌లోని కార్యకర్త నేరేళ్ల తిరుపతి ఇటీవల అనారోగ్యంతో చనిపోగా ఆయన కుటుంబాన్ని పరమార్శించారు. అలాగే దస్తూరాబాద్‌లోని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కోట వేణు ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆయన నివాసానికి వెళ్లి పరమార్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోల శ్రీనివాస్, గోస్కుల మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, చుంచు వెంకన్న, స్వామిదాస్, దీటి సత్యం, అరుగుల రాయమల్లు, నిమ్మతోట శివయ్య, బరిగెల గంగాధర్, నాగరాజు గౌడ్, మారాజు తిరుపతి, గోపాల్, రాజేష్, లాల్ నాయక్, రాజు, స్వామి, ప్రసాద్, దేవరాజు, మోహన్ నాయక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


బైక్ పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

పెంబి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే ఎఎన్‌యం రాధ స్వాతంత్ర్య దినోత్సవంనాడు కలెక్టర్ ఇలంబరిది చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బుధవారం పెంబి పీహెచ్‌సీ కేంద్రంలో ఉత్తమ అవార్డు పొందిన రాధను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేంధర్ రెడ్డి, నర్సయ్య, స్వామి సురేష్, లక్ష్మణ్, గబ్బర్‌సింగ్, తదితరులున్నారు.

'కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుంది'

ఖానాపూర్: విధి నిర్వహణలో కష్టపడి పని చేసేవారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎంపీడీవో విలాస్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలంబరిది, డీఆర్డీవో వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ప్రశంస పత్రం అందుకున్న ఖానాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ వేల్పుల అశోక్ కుమార్ యాదవ్‌ను మండల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తాము చేసే పని పట్ల అంకితభావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఈవోపీఆర్డీ చిక్యాల రత్నాకర్ రావు, ఇంచార్జీ ఏపీవో రవిప్రసాద్, ఫీల్డ్ అసిసెంట్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆర్‌పి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక కుంకుమార్చన


మాట్లాడుతున్న గురుస్వామి

నిర్మల్‌టౌన్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని రేపు హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో నిర్వహించే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ గురుస్వామి చెనిగారపు చిన్నయ్య తెలిపారు. బుధవారం అయ్యప ఆలయంలో కుంకుమార్చన సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆలయ ధర్మకర్త అల్లోల మురళీధర్‌రెడ్డి, వినోదమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లోల మురళీధర్ రెడ్డి, భవాని, లక్కడి జగన్‌మోహన్ రెడ్డి, రావుల రాంనాథ్, డాక్టర్ కృష్ణంరాజు, సాధం ఆనంద్, బ్రహ్మయ్య తదితరులున్నారు.

18న ముథోల్‌లో ఎమ్మెల్యే పర్యటన

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని నయాబాది వద్ద ఈనెల 18న ముథోల్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకై భూమి పూజ చేసేందుకు ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రానున్నట్లు మండల గౌడ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమం 18న ఉదయం 9.30 గంటలకు ఉంటుందని ఈ కార్యక్రమానికి ముథోల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన గౌడ కులస్తులందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని మహాలక్ష్మీ కాలనీకి చెందిన వైద్య విద్యార్థిని డి. సవిత మంగళవారం మత్తు ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే బుధవారం ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి నర్సాగౌడ్ మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మృతురాలు కుటుంబ సభ్యులను అనసూయ పవర్ ట్రస్టు ఛైర్మన్ రామారావు పటేల్ మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెకు దిగిన జీడీఎస్ సిబ్బంది



పోస్టుమెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీడీఎస్ సిబ్బంది

ముథోల్: ముథోల్ పోస్టాఫీసు పరిధిలో పని చేసే గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) సిబ్బంది బుధవారం నుండి నిరవదిక సమ్మెకు దిగారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో పోస్టుమెన్ అరుణ్‌కు జీడీఎస్ సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు. ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలో జీడీఎస్ కమిటీ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనిని కల్పించి సివిల్ సర్వేంట్ హోదాను ఇవ్వాలన్నారు. సర్వీసు పేరిట సిబ్బందిని మానసికంగా వేదించడం మానుకోవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భోజన్న, వహబ్, రాములు, అమీర్‌ఖాన్, పంకజ్‌కుమార్‌లున్నారు.

పేదరికం చదువుకు అడ్డురాదు

కుంటాల: చదువుకు పేదరికం అడ్డురాదని సర్పంచ్‌లు అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనంద్‌రావుపటేల్‌లు అన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన గోనె అరుణ్ ఈ సందర్భంగా వారు అభినందించారు. నేటి పోటీ ప్రపంచంలో కార్పొరేటు విద్య వైపు ప్రతీ ఒక్కరు దృష్టి సారిస్తుండగా లింబా(కె) ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివిన అరుణ్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కొంత ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాందాస్, పండరి. గజ్జారం, శంకర్‌లున్నారు.

ఎంపీడీవోకు సన్మానం

కుంటాల: ఉత్తమ ఎంపీడీవోగా ఎంపికై స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రశంసా పత్రాన్ని అందుకున్న కుంటాల ఎంపీడీవో శ్రీనివాస్‌రావును బుధవారం మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, పలు బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏసీ సతీష్, టీపీ గంగన్న, కృష్ణ, చంద్రశేఖర్‌లున్నారు.

కుభీర్‌లో..

కుభీర్: మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌సింగ్ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతులు మీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది. మోహన్ సింగ్‌కు, అవార్డు అందుకున్న ఈజీఎస్ ఈసీ సుధాకర్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, నవనిత్‌కుమార్, రామారావు, నారాయణ్ సింగ్, ఏపీవో నవీన్ కుమార్, ఏపీఎం సృజన్‌కుమార్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది. ప్రశాంత్ రవీందర్, దత్తాత్రి, దశరత్, డోడర్న సర్పంచ్ రాథోడ్ శంకర్, చాత విఠల్, కారోబారి ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనానికి ఆలనా పాలనా కరువు

● శిథిలావస్థకు చేరిన వైనం

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లో ఉన్న ప్రభుత్వ విశ్రాంతి భవనం నేడు ఆలనా పాలనా లేక పోవడంతో నిరుపయోగంగా మారింది. గతంలో రాజకీయ నేతలు, అధికారులతో కళకళలాడిన భవనం.. నేడు శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 50 సంవత్సరాల క్రితం ముథోల్ మండల కేంద్రంలో బాసర-భైంసా రహదారి ప్రక్కన విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. దీంతో పుణ్యక్షేత్రానికి వెళ్లే అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ భవనంలో బస చేసే వారు. మాజీ మంత్రి స్వర్గీయ గడ్డెన్న ఈ భవనంలో బస చేసి అధికారులతో, ప్రజలతో చర్చించే వారు. దీంతో అప్పట్లో ఈ భవనం ఎప్పుడూ కళ కళలాడేది. నియోజకవర్గంలోనే విశ్రాంతి భవనం ఒక్కటే ఉండటంతో భవన సంరక్షణ బాధ్యతను అధికారులే చూసుకునే వారు. అయితే పది సంవత్సరాల క్రితం భైంసాలో మరో విశ్రాంతి భవనం నిర్మించారు. ఇక్కడి ఫర్నీచర్, సామాగ్రీని భైంసా విశ్రాంతి భవనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు తరలించారు. దీంతో అప్పటి నుంచి విశ్రాంతి భవనం ఖాళీగా దర్శనమిస్తుంది. ప్రస్తుతం ఈ విశ్రాంతి భవనం గురించి పట్టించుకునేనాథుడు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రజలతో నిత్యం కళకళలాడిన విశ్రాంతి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విశ్రాంతి భవనాన్ని మరమ్మత్తులు చేపించి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ముథోల్ విశ్రాంతి భవనం

పూర్వ వైభవం తీసుకురావాలి..



ముథోల్‌లోని శిథిలావస్థలో ఉన్న విశ్రాంతి భవనాన్ని మరమ్మత్తులు చేసి సంబంధిత శాఖ అధికారులు పూర్వ వైభవం తీసుకురావాలి. సంబంధిత అధికారులు ఈ దిశన ఆలోచించి విశ్రాంతి భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి.

-సాయి ప్రసాద్, ముథోల్.

అధికారులు స్పందించాలి..



అధికారులు స్పందించి నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌ని విశ్రాంతి భవనానికి మరమ్మత్తులు చేపట్టాలి. ఈ భవనంతో మర మ్మత్తులతో పాటు చూట్టు ప్రహారి గోడను నిర్మించాలి. ఒకప్పుడు నాయకులు, అధికారులతో కళకళలాడిన భవనం నేడు అధికారులు పట్టించుకోక పోవడంతోనే ఈ దుస్థితి వచ్చింది.

-సాయి, తరోడ.

పార్కింగ్ దిగ్బంధనంలో అంబులెన్స్‌లు

భైంసా: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి అవరణ ద్విచక్ర వాహనాల పార్కింగ్ అడ్డాగా మారి పోయింది. భైంసా కేంద్రంగా రాకపోకలు నిర్వహించే వివిధ వర్గాల వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లె పట్టణ వాసులు తమ తమ ద్విచక్ర వాహనాలను ఇక్కడి ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఆసుపత్రికి రోగులను, క్షతగాత్రులను తీసుకవచ్చే, ఇతర ప్రాంతాలకు వారిని తరలించే 108 అంబులెన్స్, స్థానిక ఏరియా ఆసుపత్రి అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. కొంత మంది వాహన చోదకులు తమ తమ ద్విచక్ర వాహనాలను అంబులెన్స్‌ల ముందు భాగంలోనే నిలిపి వేసి వెళ్లి పోతున్నారు. అత్యవసర ఫోన్ కాల్స్ వచ్చినపుడు ముందు భాగంలో హ్యాండిల్ లాక్ చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను అష్ట, కష్టాలు పడుతూ పక్కకు తొలగించి వెళ్లి పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. క్షతగాత్రులను వైద్య సేవల కోసం గాను అంబులెన్స్‌లో తరలించుక వచ్చి నప్పుడు ప్రవేశ మార్గంలో పార్కింగ్ చేసి ఉన్న వాహనాల మూలంగా ప్రధాన రోడ్డుపై నుంచే బాధితులను స్ట్రెచ్చర్లపై ఇబ్బందులు పడుతూ ఆసుపత్రి లోపలికి తీసుక వెళ్లాల్సిన దుస్తితి నెలకొంది. సలహా సంఘం సభ్యులు, నిర్వాహణాధికారులు ఆసుపత్రి ఆవరణలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అంబులెన్స్ ముందు పార్క్ చేసి ఉన్న వాహనాలు

స్ప్రే పంపులకు భలే గిరాకీ



స్ప్రేపంపులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



విక్రయానికి సిద్ధంగా ఉన్న స్ప్రే పంపులు

భైంసా: సాగు బడిలో నెలకొన్న ప్రతికూల వాతవరణ పరిస్థితుల నేపథ్యంలో డివిజన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లోని పంట చేలు తెగుళ్ళ బారిన పడ్డాయి. ఈ కారణంగా పైరు ఎదుగుదలకు విఘాతం కలుగడమే కాకుండా దిగుబడులపై ప్రభావం పడే అవకాశాలున్నాయి. ఈ ఆపద నుండి పైరును సంరక్షించుకొని ఆశించిన దిగుబడులు సాధించేందుకు గాను రైతులు పురుగు మందులను పిచికారి చేస్తున్నారు. ఈ క్రమంలో స్ప్రే పంపుల అవశ్యకతం ఏర్పడుతుంది. దీంతో వీటికి ప్రస్తుతం గిరాకీ బాగా పెరిగింది. పట్టణంలో ఐదు స్ప్రే పంపుల విక్రయ కేంద్రాలున్నాయి. అంతే కాకుండా నాలుగు స్ప్రే పంపుల మరమ్మతు కేంద్రాలున్నాయి. స్ప్రే పంపుల వినియోగం పెరగడంతో వీటి విక్ర యా లు, మరమ్మత్తులకు సంబంధించిన దుకాణాలు రోజు రోజుకు కళ కళలాడు తున్నాయి. అన్ని రకాల పం ట లకు ప్రస్తుతం ఏదో ఒక తెగులు ఆశించడంతో వాటి నివారణకై రైతులు చర్యలు ప్రారంభించారు. దీంతో ఇక్కడి ఏ ప్రాంతంలోని పంట చేన్ల చూసిన రైతులు స్ప్రే పంపులతో పురుగు మందులను పిచికారి చేస్తు కనిపిస్తున్నారు.

ఇంటర్వ్యూ

15 సంవత్సరాలలో లోపు వారికి మీజిల్స్ రుబెల్లా టీకాలు



చిన్నన్న,
హెల్త్ సూపర్‌వైజర్, కుంటాల.

ఆంధ్రజ్యోతి: మీజిల్స్, రుబెల్లా టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించారా..?

అధికారి: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులకు ఇప్పటికే మీజిల్స్, రుబెల్లా టీకాలపై అవగాహన కల్పించాం. 9 నెలల నుంచి 15 లోపు వారందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 17 నుంచి 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, వచ్చే నెల 1 నుంచి 11 తేదీ వరకు మిగిలిన వారికి 11వ తేదీ వరకు ప్రతీ ఒక్కరికి టీకాలను వేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో రోగులకు సరిపడా మందులున్నాయా..?

అధికారి: వర్షాకాలం దృష్ట్యా అన్ని రకాల వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. తమ సిబ్బంది అందుబాటులో ఉంటు ఎప్పటికప్పుడు మందులకు అందజేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు..?

అధికారి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వ్యక్తి గత పరిశుభ్రత, తాగే నీరు, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై ఆశా కార్యకర్తల ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ అవసరమైన వారికి అన్ని వేళల ఉచితంగా మందులను అందిస్తారు.

-కుంటాల

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.

మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కుల వృత్తులకు ముఖ్యమంత్రి చేయూత

● యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు


దండేపల్లిలోలో మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

దండేపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలంగాణ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం దండేపల్లిలో యాదవసంఘం భవనంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న గొల్ల కుర్మల ఆర్థిక పురోభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. యాదవులంత ఐకత్యగా ఉంటూ సంఘం బలోపేతానికి పాటుపడ్డాలన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెల పంపిణీ చేస్తారన్నారు. యాదవుల్లో అధికశాతం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. యాదవులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడేళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి 119 బీసి గురుకులాలు ప్రారంభించి అందులో యాదవ పిల్లలకు కూడా అవకాశం కల్పించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 19 గురుకులాలు ఉంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 119 ఏర్పాటు చేశారని ఈసందర్భంగా గుర్తు చేశారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేసేది టీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఈకార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్వాల సమ్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు జెల్ల శంకరయ్య, జిల్లా మహిళ యాదవ సంఘం అధ్యక్షురాలు పద్మక్క, జిల్లా నాయకులు తిరుమల, గడ్డం సతీష్, అంజయ్య, మండల అధ్యక్షులు తోట జయ్యన్న, మండల నాయకులు చెన్నయ్య, నరేష్,బానుప్రసాద్, .ధర్మరాజు, కుమార్‌స్వామి, మల్లేష్, సత్యనారాయణ, రామన్న, గంగన్న,అశోక్, మహేష్, రాజన్న తదితరులు ఉన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి

నెన్నెల: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. కంట్రిబ్యూటరీ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. తహసిల్దార్ సత్యనారాయణకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇన్నారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 సెప్టెంబరు1 నుంచి నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. దీంతో రిటైర్డు అయిన వారికి అతి తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. పాత పెనన్ విధానం అమలయ్యే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో సంఘం ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బి. మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్, మండల విద్యాధికారి శ్రీధర్‌స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడూరి శ్రీనివాస్, చంద్రమౌళి, బెల్లంపల్లి, మందమర్రి మండలాల అధ్యక్షులు చెన్న కేశవులు, అరవింద్‌కుమార్, మండల బాధ్యులు ఎస్ సదయ్య, కార్యదర్శి పి. శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని ఇన్కర్ మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోమాస రాజం



బెల్లంపల్లి టౌన్: తెలంగాణ నేతకాని ఇన్కర్ మహర్ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లిలోని స్టేషన్ రోడ్డు కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు గోమాస రాజం ఎన్నికయ్యారు. బుధవారం బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో గోమాస రాజంను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మాణించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య రాష్ట్ర ప్రధాన కార్యధర్శి కలాలి నర్సయ్యలు తెలిపారు. ఈసందర్భంగా గోమాస రాజం మాట్లాడుతూ సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేసేందుకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎంప్లాయిమెంట్ కార్డుల రెన్యూవల్‌కు అవకాశం

మంచిర్యాల టౌన్: మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన శాఖలో గతంలో ల్యాప్ అయిన కార్డుల రెన్యూవల్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ అధికారి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2000 నుంచి 31 జులై 2017 మధ్య కాలంలో లాప్స్ అయిన కార్డులకు రెన్యూ వల్ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇట్టి కార్డులను ఈ సంవత్సరం డిసెంబర్ 31 వరకు రెన్యూవల్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


వంజరిగూడలో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

● కిడ్నీ బాధితులకు ప్రభుత్వం భరోసా

లింగాపూర్: కుమరంభీం జిల్లా లింగాపూర్ మండలంలోని వంజరిగూడలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి కోసం బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన వాటర్‌ప్లాంట్‌ను తహసీల్దార్ ఆర్.బాబుసింగ్, ఎస్సై తిరుపతిలు ప్రారంభించారు. గ్రామానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీష్, గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు చొరవతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వంజరిగూడలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వంజరిగూడ గ్రామస్థులను ప్రభుత్వపరంగా మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వపరంగా వైద్య సదుపాయాలు అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. గ్రామస్థులు వ్యక్తిగత పరిశుభ్రత, గ్రామ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతిక కిడ్నీ బాధితులను వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వం తక్షణం స్పందించిందన్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎస్సై తిరుపతి మాట్లాడుతూ గ్రామస్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు కేంద్రె బాబు, గణపత్, గుణవంతరావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మారుమూల ఆదిమ కోలాం గిరిజన గ్రామమైన గీతబండ గ్రామాన్ని తహసీల్దార్ బాబుసింగ్, ఎస్సై తిరుపతి బుధవారం సందర్శించారు. గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సమస్యల గురించి ఈసందర్భంగా స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు'


కెరమెరిలో గిరిజనేతరులకు పహణీలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

కెరమెరి: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. కెరమెరి మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి మండలంలోని అంతాపూర్, పరందోళి, సుర్దాపూర్, కెరమెరి, కైరి, మోడి గ్రామపంచాయతీలకు చెందిన గిరిజనేతరులకు పహాణీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎకరానికి నాలుగు వేల రూపాయలు, రెంటు పంటలు వేసే రైతులకు ఎకరానికి ఎనిమిది వేలు వచ్చే ఖరీఫ్ నుంచి నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పహానీలు అందజేస్తున్నట్లు ఆమె గుర్తు చేశారు. అనంతరం బీసీ హస్టల్, గ్రామపంచాయతీల్లో హరిత హారంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలను ప్రతి ఒక్కరు సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్యం పెరిగి పోతున్న నేటి తరుణంలో ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టారు. బీసీ హాస్టల్‌కు రంగులు వేయడానికి రూ.50 వేలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే హస్టల్‌కు బోరుబావిని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహారి గోడను నిర్మించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మికి విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ యాదవ్‌రావు, ఎంపీపీ గణేష్, జడ్పీటీసీ అబ్దుల్‌కలాం, సర్పంచ్ సుంగుబాయి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు పెందూర్ జలపత్‌రావు, మడావి భీము, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఉత్తంనాయక్ పాల్గొన్నారు.


కొయ్య బొమ్మలను తయారు చేస్తున్న కళాకారులు

కొత్త జిల్లాల్లో గోల్కొండ షోరూంలు!

● అమెజాన్‌తో ఒప్పందం, అంతర్జాతీయ మార్కెటింగ్‌కు అవకాశం ● ఒక్కో జిల్లాకు రూ. 2కోట్లు

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

మొన్నటి వరకు చేతి వృత్తులను విక్రయిస్తూ పేరు గడించిన లేపాక్షి సంస్థ స్థానంలో ఏర్పాటు చేసిన గోల్కొండ ఇక అన్ని జిల్లాలకు విస్తరించబోతోంది. హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాలకే పరిమితమైన లేపాక్షిని తెలంగాణ సర్కారు రద్దు చేసి గోల్కొండ పేరిట కొత్త చేతి వృత్తుల వాణిజ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. గతంలో మాదిరిగా కాకుండా తెలంగాణ ప్రాంతంలో చేతి వృత్తుల ద్వారా తయారయ్యే వస్త్రాలు, కొయ్య బొమ్మలు ఇతర కుటీర ఉత్పత్తులను కూడా గోల్కొండ షోరూంలలో విక్రయించనున్నారు. ప్రతీ జిల్లా కేంద్రంలో ఓ గోల్కొండ షోరూంను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఈ గోల్కొండ షోరూం ఇతర షోరూంల కన్నా ప్రాధాన్యతను సంతరించుకోబోతుంది. ఇక్కడ గోల్కొండ షోరూంలో చేనేత వస్త్రాలతో పాటు ఇక్కడే తయారయ్యే కొయ్య బొమ్మలను విక్రయించనున్నారు. దీని కోసం ప్రత్యేక విక్రయశాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ షోరూం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లను మంజూరు చేసింది. ముఖ్యంగా చేనేత వస్త్రాలతో పాటు కొయ్య బొమ్మలను విక్రయించడమే గోల్కొండ షోరూంల ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. గోల్కొండ షోరూంలతో పాటు అమెజాన్ అంతర్జాతీయ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ ద్వారా కూడా చేనేత వస్త్రాల అమ్మకాలను, అలాగే కొయ్య బొమ్మల అమ్మకాలను చేపట్టేందుకు కూడా రంగం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమెజాన్ సంస్థతో ఎంఓయూ కూడా కుదుర్చుకుంది.

● కొద్దిరోజుల్లోనే షోరూంల ఏర్పాటు

గోల్కొండ షోరూంలను కొద్ది రోజుల్లోనే నిర్మల్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల్, కొమురం భీం (ఆసిఫాబాద్), ఆదిలాబాద్ జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. గోల్కొండ షోరూంల ఏర్పాటుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చనుంది. కాగా రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ గోల్కొండ షోరూంలలో సేల్స్‌మెన్, మేనేజర్‌లాంటి పోస్టులను ఆ సంస్థ నియమించనుంది. ఈ నియామకాల్లో స్థానికులకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. అలాగే సొంత భవనాల నిర్మాణాలకు కూడా ప్రాధాన్యత కల్పించనున్నారు.

● చేనేత వస్త్రాల కొనుగోళ్లు తప్పని సరి

గోల్కొండ షోరూంలలో నిర్మల్ కొయ్య బొమ్మలతో పాటు చేనేత వస్త్రాలను పెద్ద ఎత్తున విక్రయించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాగా సిరిసిల్లలో తయారయ్యే చేనేత వస్త్రాల ఎక్కువగా విక్రయించాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా చేనేత వస్త్రాల వినియోగాన్ని కొన్ని విభాగాలకు అలాగే కొన్ని పండుగలు, పర్వదినాలకు తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులు ఉపాధ్యాయులు, చాలా సందర్భాల్లో చేనేత వస్త్రాలను వినియోగించే విధంగా చర్యలు తీసుకోనుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా పేద మహిళలకు అందించాలని భావిస్తున్న చేనేత చీరలను కూడా గోల్కొండ సంస్థ ద్వారానే చేపట్టాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం.

● గతంలో 'ఆప్కో'...!

గతంలో 'ఆప్కో' సంస్థ అన్ని ప్రధాన పట్టణాల్లో చేనేత వస్త్రాలను ఇతర చేతి కళా వృత్తులను విక్రయించేవి. అయితే ఈ సంస్థ నష్టాలపాలవ్వడంతో ఆప్కో షోరూంలను ఎత్తివేశారు. నిర్మల్‌లో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఆప్కో దుకాణాల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. అయితే ఆప్కో కనుమరుగు కావడం దీని స్థానంలో గోల్కొండ కొత్త తరహాలో తెరపైకి వస్తుండడం గమనార్హం.

● అమెజాన్‌తో ఒప్పందం..
చేతి వృత్తులకు మహర్దశ

అంతర్జాతీయ ఆన్‌లైన్ వ్యాపార దిగ్గజం అమెజాన్‌తో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ అలాగే ప్రభుత్వం కూడా చర్చలు జరిపి చేనేత వస్త్రాలు, నిర్మల్ కొయ్య బొమ్మ విక్రయానికి ఎంవోయూ కుదుర్చుకోవడం చేతి వృత్తుల వాణిజ్య రంగంలో చారిత్రక పరిణామంగా అభివర్ణిస్తున్నారు. ఇప్పటికే నిర్మల్ కొయ్య బొమ్మలను అమెజాన్ ఆన్‌లైన్‌లో విక్రయిస్తుండగా చేనేత వస్త్రాల విక్రయాలను కూడా మొదలు పెట్టబోతుంది. అమెజాన్ సంస్థతో ఒప్పందం జరిగిన తరువాత చేనేత వస్త్రాలు, కొయ్య బొమ్మల విక్రయాలు పెరిగినట్లు చెబుతున్నారుక. అలాగే వీటికి డిమాండ్ కూడా పెరుగుతోంది.

● ఇతర కుటీర వస్తువులకు డిమాండ్

ఇటీవల కుటీర పరిశ్రమలు కూడా పెరిగిపోయాయి. కొయ్య బొమ్మలతో పాటు విస్తారాకులు, ఆకు గిన్నెలు, క్యాండిల్స్, వెదురుతో తయారు చేసిన వస్తువులను గోల్కొండలో విక్రయించాలని భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే వస్తువులకు ఇందులో ప్రాధాన్యం కల్పించనున్నారు.

● గోల్కొండతో మెరుగుపడనున్న ఉపాధి

గోల్కొండ షోరూంల ఏర్పాటు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. కొయ్య బొమ్మల కళాకారులే కాకుండా చేనేత కార్మికులకు, కుటీర పరిశ్రమలు నిర్వహించే వారికి చేతి నిండా పని దొరకనున్నట్లు చెబుతున్నారు.

'ఉపాధి' శాశ్వతపు నిర్మాణ పనులు

(నిర్మల్‌అగ్రికల్చర్)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో శాశ్వత నిర్మాణ పనులను చేపట్టి కూలీలకు పని కల్పించనున్నారు. 60 శాతము కూలీల వేతనాలకు, 40 శాతం మేటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో మట్టిపనుల కల్పనకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేది. గ్రామ అభివృద్ధిశాఖ ఇక శాశ్వత నిర్మాణాలపై దృష్టి సారించింది. పంచాయతీరాజ్‌శాఖ సహకారంతో మండల, జిల్లా సెక్టర్లలో మురికి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణము పనులకు నిధులు ఖర్చుచేయనుంది. గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో రూ.10 లక్షలతో భవన నిర్మాణాలు, మహిళా సంఘాల కోసం మండల కేంద్రాల్లో స్త్రీ శక్తి భవన నిర్మాణానికి రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్నారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం గ్రామాల్లో రూ.5లక్షల వ్యయంతో చెక్‌డ్యాం నిర్మాణాలను గతంలో చేపట్టారు. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలను చేపడుతున్నారు.

● వంటగదుల నిర్మాణం (కిచెన్ షెడ్స్)

గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వంట గదుల నిర్మాణాలు 25 నుంచి 200 వరకు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాల స్కూల్‌లో టైప్-1 కింద రూ. ఒక లక్ష 99 వేల వ్యయంతో, 4.7 మీటర్ల పొడవు, 3.2 మీటర్ల వెడల్పు, 9 ఫీట్ల ఎత్తులో, ఇటుకలు, సిమెంట్ స్లాబ్ నిర్మాణం టైప్-2 కింద, 200 పైన విద్యార్థులున్న పాఠశాలల్లో 4.7 మీటర్ల పొడవు, 4.3 మీటర్ల వెడల్పు, 9 ఫీట్ల ఎత్తు ఇటుకలను సిమెంట్ మిశ్రమంతో శ్లాబ్ నిర్మాణ వ్యయం రూ. 2 లక్షల 49వేలతో చేపడుతున్నారు.

● పశువుల తొట్టి నిర్మాణం

వేసవిలో పశువుల దాహర్తిని తీర్చేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు పశువుల తొట్టిల నిర్మాణాలను చేపడుతున్నారు. 5మీ. పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.70 ఎత్తు. ఇటుకలు, సిమెంట్ మిశ్రమం ప్లాస్టరింగ్‌లో సగం వ్యయం రూ. 17వేల నుంచి 20 వేలతో తొట్టెల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

● సేద్యపు బావుల నిర్మాణం

ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతుల పంట భూముల్లో సాగు నీటి కోసం సేద్యపు బావుల నిర్మాణము చేపడుతున్నారు. రూ.ఒకలక్ష 70 వేల నుంచి రూ. రెండు లక్షలతో వీటిని నిర్మిస్తున్నారు. బావి వృత్తాకారము 8 మీటర్లు, 40 అడుగులలోతు, మట్టి కూలకుండా 15 అడుగుల వరకు సిమెంట్ రింగులు, బావి తవ్వకంలో బండరాళ్లు వస్తే బ్లాస్టింగ్ సౌకర్యం, మట్టి ఎత్తడానికి క్రేన్‌ను వాడనున్నారు. బావి నిర్మాణాపుద్వారా 2 నుంచి 4 ఎకరాల సాగుకు నీటిపారుదలకు అవకాశం ఉంటుంది.

● పశువుల పాకలు

గ్రామీణ ప్రాంతాల్లో పశువుల సంరక్షణ నిమిత్తం, వర్షాలు, ఎండ, చలి వాటి నుంచి కాపాడుకునేందుకు రైతులు పశువుల పాకలను నిర్మించుకోవచ్చు. రైతుకు 4 నుంచి 6 గొర్రెలు, 4-8 ఆవులు ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులు దీనికి అర్హులు. నిర్మాణం 15 ఫీట్ల పొడవు, 12 ఫీట్ల వెడల్పు, 8 ఫీట్ల ఎత్తులో ఇటుకలతో నిర్మిస్తారు. ప్లాస్టరింగ్, పైకప్పు ఇనుప రేకుల నిర్మాణం నిర్మాణ వ్యయం రూ.50వేలు అవుతుంది.

● గొర్రెల, మేకల షెడ్స్

మేకల, గొర్రెల పెంపకం దారుల సౌకర్యం నిమిత్తం గొర్రెల మేకల పాకలను నిర్మిస్తారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, పెంపకం దారులకు 10 నుంచి 20 గొర్రెల, మేకలు ఉండాలి. 15 ఫీట్స్ పొడవు, 12 ఫీట్స్ వెడల్పు, 8 ఫీట్ల ఎత్తు, ఇటుకల నిర్మాణం, పైన రేకులు వ్యయం రూ. 49 వేలతో నిర్మిస్తారు.

● వైకుంఠధామం
(శ్మశాన వాటికల నిర్మాణం)

గ్రామాల్లో శ్మశాన వాటికలను బాగుపరిచి, అవసరమయ్యే శాశ్వత పనులను చేపడతారు. 54 అడుగుల పొడవు, 49 అడుగుల వెడల్పు స్థలం అవసరం. భూమిని చదును, ముళ్లపొదల తొలగింపు పనులను చేపడతారు. శవాలను కాల్చేందుకు 2 స్టాండ్‌లతో కూడిన నిర్మాణం. ఒక విశ్రాంతి గది, స్త్రీ, పురుషులకు, వేరు వేరు స్నానపు గదులు, టాయిలెట్ల నిర్మాణం ముఖ ద్వార నిర్మాణాలను రూ. 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు.

శాశ్వత నిర్మాణాలపై దృష్టి
- డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



గ్రామాల్లో ఇక నుంచి శాశ్వత నిర్మాణ పనులపై దృష్టి సారించాము. ఎక్కువగా వాటికే ప్రాధాన్యత ఇస్తున్నాము. రైతులకు ఉపయోగపడే వాటిని నిర్మిస్తున్నాము. వ్యవసాయానికి ఉపయోగపడే నిర్మాణాలను ప్రభుత్వ నిధులతో నిర్మించుకోవచ్చు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

● జిల్లా కేంద్రంలో దూడల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జోగురామన్న


దూడల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, అందుకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో రూ.6లక్షలతో నిర్మించిన దూడల పెంపకం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పాల శీతలీకరణ కేంద్రం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వాలు దీనిని ముందుకు తీసుకెళ్లలేకపోయారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాల ఉత్పత్తి చేసే రైతులకు రూ.4తో ఇన్సెంటివ్‌తో విజయడైరీ ద్వారా కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పాలశీతలీకరణ కేంద్రాలను అభివృద్ధి పరుస్తూ, రైతుల నుంచి పాలను ఎగుమతి, దిగుమతి చేసుకోవడానికి ప్రత్యేక వాహనాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎంపీ నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ రంగినేని మనీషా, ఏఎంసీ చైర్మన్ ఆరె రాజన్న, జడ్పీటీసీ ఇజ్జగిరి అశోక్,

'పథకాలల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి'

తాంసి: గత పాలక మండల్లు అస్తిపంజరం లాంటివని, ఏ పథకం మంజూరైనా అవి గిరిజనుల దరికి చేర్చలేదని కానీ ప్రస్తుత పాలక మండల్లు ప్రతీ పథకాన్ని గిరిజనుల ముంగిటకు చేర్చాలని ఎంపీ జి.నగేష్ అన్నారు. బుధవారం సాయంత్రం భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ఆయన హాజరయ్యారు. ప్రభుత్వానికి, ప్రజలు పాలక మండలి వారధిగా పని చేయాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు అన్ని పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఐటీడీఏ పాలక మండలి కొలువు దీరిందని పాలక మండలి సభ్యులంతా సమిష్టి కృషితో గిరిజనుల అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు కుంటు పడితే వాటిని వెంటనే పరిష్కరించేందుకు నడుం బిగించాలన్నారు. ప్రతీ రైతుకు సాగునీరందించేందుకోసం పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న బ్యారేజ్ వల్ల 52 వేల ఎకరాలకు సాగునీరందనుందన్నారు. ప్రతీ గిరిజనుడు సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఉద్ఘాటించారు. అనంతరం ఎంపీ నగేష్, ఐటీడీఏ చైర్మన్ లక్కేరావులను బుధవారం అందర్‌బంద్ గ్రామస్తులను సన్మానించారు. గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఇందులో ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ లక్కేరావు, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ అన్ను పటేల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిషికాంత్, మండల ఉపాధ్యక్షుడు కృష్ణా, ఐటీడీఏ డైరెక్టర్ మర్సకొల్ల మనోహర్ పటేల్, ఎంపీటీసీ అమృత్‌రావ్, నాయకులు రాజు, తాంసి భీంపూర్ మండలాల కన్వీనర్ కృష్ణా, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ డాక్ సేవకుల సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్‌టౌన్: జీడీఎస్ ఉద్యోగుల జీతభత్యాల నిర్ణయించేందుకు వేసిన కమలేష్ చంద్ర కమిటీ సిఫారస్సులను వెంటనే అమలు చేయాలని తపాలాశాఖ ఉద్యోగులు పేర్కొన్నారు. కేంద్ర సంఘం పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ తపాల కార్యాలయం ఎదుట జీడీఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ రాష్ట్ర సహాయ కోశాధికారి షేక్ హకీం, డీవిజన్ కార్యదర్శి బి.సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సమాన వేతనాలు చెల్లించాలన్నారు. ఢిల్లీ క్యాట్, మద్రాస్ క్యాట్, బెంచిలు ఇచ్చిన తీర్పు ప్రకారం జీడీఎస్ ఉద్యోగులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. జీడీఎస్ ఉద్యోగులకు సివిల్ సర్వేంట్ హోదా కల్పించాలని సమస్యలను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.నారాయణ, రాజారెడ్డి, ప్రదీప్ రెడ్డి, సత్యనారాయణ, నారాయణ, ప్రభాకర్, రాజు, విలాస్, రఘు, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో మైక్రో ఇరిగేషన్ అభివృద్ధి

● అన్నదాతల సాగు నీటి కష్టాలను తీర్చేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు ● హార్టికల్చర్ కమిషనర్ వెంకటరాంరెడ్డి

భైంసా: రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌తో మైక్రో ఇరిగేషన్ అభివృద్ధికి తెలంగాణ సర్కార్ ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టిందని హార్టికల్చర్ కమిషనర్ వెంకటరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం భైంసా పట్టణంలో ఇద్దరు యువకులు చేపట్టిన పట్టు పురుగుల పెంపక కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, భూగర్భ జలాలు అడుగంటి పోతుండడం తదితర కారణాల మూలంగా అన్నదాతలు సాగునీరు అందక అవస్థల పాలవుతున్నారని, సాగు బడిలో కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న సాగు నీటి ఇబ్బందులు తొలగించేందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్ మైక్రో ఇరిగేషన్ ద్వారా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించి మైక్రో ఇరిగేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. డ్రిప్, స్పింక్లర్‌లను సబ్సిడీ ద్వారా అందించి రైతులకు తోడ్పాటునిచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ కోసం గాను ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 1.10లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. వీరందరికీ దశల వారీగా డ్రిప్, స్పింక్లర్‌లను అందించనున్నామని తెలిపారు. తద్వారా నాలుగు లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటి వ్యవస్థ కలగనుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఇది వరకటిలా లోపాలకు తావులేకుండా పారదర్శకమైన విధానంలో జరుగుతుందన్నారు. అర్హులందరికీ మైక్రో ఇర్రిగేషన్ ద్వారా లబ్ధి చేకూరనుందన్నారు. గతంలో ఒక పర్యాయం మైక్రో ఇర్రిగేషన్ పథకంలో లబ్ధి పొందిన రైతుకు పది సంవత్సరాల వరకు మరోమారు సబ్సిడీ ద్వారా డ్రిప్, స్పింక్లర్‌లు అందేవి కావన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పది సంవత్సరాలకు బదులుగా ప్రతీ ఐదు సంవత్సరాలకోసారి మైక్రో ఇర్రిగేషన్ పథకాన్ని అందించేందుకు గాను చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైతులు సాగుబడిలో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించాలన్నారు. నేటి పరిస్థితుల్లో ఉద్యానవన పంటలతో పాటు సెరీకల్చర్ సాగు ప్రయోజనకరంగా ఉందన్న విషయాన్ని రైతులు



మల్బరీ తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ వెంకటరాంరెడ్డి

గుర్తుపెట్టుకోవాలన్నారు. సెరీకల్చర్ ద్వారా పట్టు పురుగుల పెంపకాన్ని చేపడితే ఎకరానికి రూ.30 నుంచి రూ.35 వేల వరకు ఆదాయం వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం సెరీకల్చర్ అభివృద్ధికి, సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సహించేందుకు గాను సబ్సిడీ పథకాలను రూపకల్పన చేస్తుందన్నారు. రైతులు మైక్రో ఇరిగేషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రగతి బాట పట్టాలని ఆకాంక్షించారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా రైతులు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. సంబంధిత పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ప్రగతి బాటలో పయనించాలన్నారు.

● పట్టు పురుగుల పెంపకందారులకు ఘన సన్మానం

జిల్లాలో తొలిసారి సెరీకల్చర్‌లో పట్టు పురుగుల పెంపకాన్ని చేపడుతున్న భైంసా పట్టణంలోని రమాకాంత్, మహేష్ అనే ఇద్దరు యువ రైతులను హార్టికల్చర్ కమిషనర్ వెంకట్‌రాంరెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. జిల్లాలోని రైతులు పట్టు పురుగుల పెంపకాన్ని మార్గదర్శకమైన రీతిలో నిర్వహిస్తున్న యువకులిద్దరినీ ప్రతి ఒక్క రైతు ఆదర్శంగా తీసుకుని ఆ దిశలో సాగు చేసేందుకు గాను ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టు పురుగుల పెంపకాన్ని చేపడుతున్న రమాకాంత్ ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ వెంకటరాంరెడ్డిలతో మాట్లాడుతూ సెరీకల్చర్‌కు సబ్సిడీని త్వరితగతిన అమలు పరిస్తే రైతులకు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి నర్సయ్య, ఉద్యానవన శాఖ అధికారి ఆకుల వేణు, విస్తీర్ణ అధికారులు మోయిన్, సౌమ్య, టీఆర్ఎస్ జిల్లా ప్రతినిధులు నంగి రాజేష్, రమణారెడ్డిలతో పాటు పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మీజిల్స్, రూబెల్లా టీకాల అందజేతకు సర్వం సిద్ధం

● భైంసా డివిజన్‌లో 73,573 లబ్దిదారులు ● 871 కేంద్రాల ఏర్పాటు ● 65 మంది సిబ్బంది నియామకం

భైంసా: డివిజన్ పరిధిలో మీజిల్స్, రూబెల్లా నివారణ టీకాల అందజేతకు వైద్య ఆరోగ్య శాఖ రంగం సిద్ధం చేసింది. ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా టీకాల అందజేత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టింది. డివిజన్ పరిధిలో మొత్తం 73,573 మంది 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులను టీకాలను అందించేందుకు గాను అధికార యంత్రాంగం గుర్తించింది. వీరికి టీకాలను అందించేందుకు గాను మొత్తం 871 కేంద్రాలను ఏర్పాటు చేసి 65 మంది సిబ్బందిని నియమించారు. కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12,714 మంది చిన్నారులకు టీకాలు అందించేందుకు గాను గుర్తించారు. వీరి కోసం 76 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, 65 అంగన్‌వాడీ కేంద్రాలలో, 17 ఆరోగ్య శాఖ కేంద్రాల్లో టీకాలను అందించేందుకు గాను 15 మంది ఆరోగ్య సిబ్బందిని నియమించారు. కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9498 మంది చిన్నారులకు గుర్తించి 49 పాఠశాలల్లో, 32 అంగన్‌వాడీలలో, 14ఆరోగ్య కేంద్రాలలో టీకాలను అందించేందుకు గాను 7గురు మంది ఆరోగ్య సిబ్బందిని నియమించారు. భైంసా మండలంలోని మహాగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 7948 మంది చిన్నారులకు టీకాలను అందించేందుకు గాను 9 మంది సిబ్బంది నియమించారు. వీరి కోసం 49 పాఠశాలలు, 49 అంగన్‌వాడీ కేంద్రాలు, 11 ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. భైంసా పట్టణ పరిధిలో 14,205 మంది చి



సిద్ధంగా ఉన్న వ్యాక్సినేషన్ క్యారియర్‌లు

న్నారులను గుర్తించి 82 పాఠశాలల్లో, 48 అంగన్‌వాడీ కేంద్రాలలో, 19 ఆరోగ్య కేంద్రాలలో టీకాలను అందించేందుకు గాను 9 మంది ఆరోగ్య సిబ్బందిని నియమించారు. బాసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14,550 మంది చిన్నారులను గుర్తించి వీరి కోసం 99 పాఠశాలలో, 62 అంగన్‌వాడీ కేంద్రాలలో, 17ఆరోగ్య కేంద్రాలలో 12 మంది సిబ్బంది నియమించారు. తానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 7918 మంది చిన్నారులకు గాను 56 పాఠశాలల్లో, 39 అంగన్‌వాడీ కేంద్రాలలో, 15 ఆరోగ్య కేంద్రాలలో శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలను అందించేందుకు గాను ఆరుగురు ఆరోగ్య సిబ్బందిని నియమించారు. లోకేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 6740 మంది చిన్నారులకు టీకాలను అందించేందుకు 37 పాఠశాలల్లో, 25 అంగన్‌వాడీ కేంద్రాలలో, 10 ఆరోగ్య కేంద్రాలలో శిబిరాలను ఏర్పాటు చేసి ఏడుగురు ఆరోగ్య సిబ్బందిని నియమించారు.

మూడు విడతలుగా టీకాల అందజేత..

మీజిల్స్, రూబెల్లా నివారణ టీకాలను డివిజన్ పరిధిలో 3 విడతలుగా అందించేందుకు గాను వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం నుంచి 31వ తేదీ వరకు పాఠశాలల్లో, వచ్చే నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో, మిగిలిన చిన్నారులకు 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు టీకాలను అందించేందుకు గాను డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ అధికార యంత్రాంగం కార్యచరణ ప్రణాళిక రూపొందించింది.

ప్రతీ పీహెచ్‌సీలో ఏఈఎఫ్ఐ కేంద్రాల ఏర్పాటు

మీజిల్స్, రూబెల్లా టీకాలను తీసుకున్న చిన్నారులకు ఏదైనా కారణం చేత రియాక్షన్ జరిగితే వెంటనే తదుపరి వైద్య సేవలు అందించేందుకు గాను ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఈఐఎఫ్ కేంద్రా లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈఏఈఐఎఫ్ కేంద్రంలో ఒక వైద్యాధికారి, ఒక ఆరోగ్య కార్యకర్త దినం వేళలో అందుబాటులో ఉండి రియాక్షన్ జరిగిన చిన్నారులకు అవసరమైన వైద్య చికిత్సలు అందించ నున్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

భైంసా: పాఠశాలల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో విద్యార్థులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఏరియా ఆసుపత్రిలోని కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కె వైద్యాధికారులకు ప్రభుత్వం సరఫరా చేసిన ల్యాప్‌టాప్‌లను అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్న ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరాల ద్వారా సత్ఫలితాలు లభిస్తున్నాయన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల ద్వారా వారి ఆరోగ్య పరిస్థితులు వెల్లడవుతున్నాయన్నారు. తద్వారా వారికి అవసరమైన చికిత్సలు అందించేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. అయితే ఇది వరకు సంబంధిత ఆరోగ్య పరీక్షల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. ఈ సమస్యను నివారించేందుకు గాను ప్రభుత్వం ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులకు, సిబ్బందికి ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసిందన్నారు. వైద్యాధికారులు ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకొని నిర్వాహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా, ముథోల్ సబ్ డివిజన్ల ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ డిపోలో నెలకొన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ స్వామి, పత్తు సింగ్‌లు మాట్లాడుతూ అసిస్టెంట్ మేనేజర్ మహిళ కండక్టర్లపై అనుసరిస్తున్న దురుసు ప్రవర్తనను ఆరికట్టాలన్నారు. మహిళా కార్మికులకు నెలవారి సమస్యల తలెత్తిన సమయంలో అత్యవసర సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతి నెల కార్మికులకు మూడు రోజుల సెలవులు ఇవ్వాలన్నారు. టీం డ్రైవర్లకు పర్మినెంట్ రోటేషన్ చాట్ వేయాలన్నారు. నిబంధనలకు విరుద్దంగా పెంచిన కిలో మీటర్లను వెంటనే తగ్గించాలని, సరైన రన్నింగ్ టైం ఇవ్వాలన్నారు. బస్ డిపో, బస్టాండ్‌లో భోజన వసతి, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. అదే విధంగా డబుల్ డ్యూటీలు చేసిన వారికి డ్యూ ఆఫ్‌లు ఇవ్వాలన్నారు. మెకానిక్‌లకు అప్రెంటిస్‌లకు బదులుగా పర్మినెంట్ సహాయకులను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, జీఎస్. నారాయణ, రమేష్, అహ్మద్, అశోక్, శేఖర్‌లున్నారు.

ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ

నిర్మల్ కల్చరల్: నిర్మల్ పట్టణంలోని బస్టాండ్‌తో పాటు రద్దీ ప్రాంతాల్లో ఇటీవల మహిళలను ఈవ్ టీజింగ్ చేస్తున్న 5 గురు యువకులను బుధవారం పోలీస్ స్టేషన్‌లో ప్రవేశ పెట్టారు. షీటీం ఎస్ఐ ఆంజమ్మ అధ్యర్యంలో రాత్రి పూట గస్తీ నిర్వహించిన పోలీసులు 5గురు యువకులను ఆదుపులోకి తీసుకుని పట్టణ సీఐ ముందు ప్రవేశ పెట్టారు. సీఐ జాన్‌దివాకర్ యువకుల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి వారి ముందు హెచ్చరించారు. తిరిగి ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. యువకులతో ప్రతిజ్ఞ చేయించి వదిలిపెట్టారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని సూచించారు.

వణుకుపుట్టిస్తున్న

వయ్యారిభామ

● పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం ● మనుషులకూ అనారోగ్యం



దిలావర్‌పూర్‌లో సోయా పంటను కప్పేసిన వయ్యారి భామ

దిలావర్‌పూర్ : వయ్యారి భామ.. పేరు ముచ్చటగా ఉన్న ఈ మొక్క వల్ల పంటలకు, పశువులకు, మనుషులకు పొంచి ఉన్న ముప్పు అంతా ఇంతా కాదు. అత్యంత వేగంగా విస్తరించే ఈ కలుపు మొక్క, పంట దిగుబడులను సగానికి సగం తగ్గించగలదు. వయ్యారి భామ ఉన్నచోట తిరిగితే మనుషులకు చర్మ, శ్వాససంబంధ వ్యాధులు సోకుతాయి. మేసిన పశువులకు ప్రాణహాని కలుగుతుంది. అందువల్ల ఈ మొక్క ఎక్కడ కనిపించినా ఆలస్యం చేయకుండా పీకివేయాలని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు.

● అపార పంటనష్టం...

వయ్యారి భామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క. ఇది స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల పంటల పెరుగుదల నశిస్తుంది. పూత, పిందెలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం 40 శాతం నుంచి 50 శాతం వరకు పంట దిగుబడిని తగ్గిస్తుంది. నేలలో నత్రజని, పోషకవిలువలు, సూక్ష్మదాతువుల శాతాన్ని తగ్గిస్తుంది. పత్తి, కూరగాయలు, మామిడి, సోయాబీన్, పూల తోటల్లో విస్తృతంగా పెరుగుతుంది. కొన్ని రకాల వైరస్ తెగుళ్ల వ్యాప్తికీ వయ్యారిభామ కారణమవుతుంది.

● ఈ మొక్కకు ఎన్నోపేర్లు..

ఈ మొక్కను మన రాష్ట్రంలో చాలా పేర్లతో పిలుస్తారు. అమెరికా అమ్మాయి, కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, చతక్ చాందిని, గజర్, అపాదిమొక్క, ముక్కుపుడకల గడ్డి ఇలా ప్రాంతాలను బట్టి పేర్లున్నాయి. జిల్లాలో మాత్రం వయ్యారి భామ, ముక్కుపుడకలగడ్డి అని పిలుస్తారు. దీని శాస్త్రీయనామం పార్థనీయం హిస్టోరోపోరెస్.

● మనదేశంలోకి ఇలా..

వయ్యారిభామను తొలుత అమెరికాలోని ఉష్ణప్రాంతంలో కనుగొన్నారు. అక్కడి నుంచి ఆహారధాన్యాలతో పాటు మన దేశానికి దిగుమతైంది. 1973లో ఈ మొక్క మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో కనిపించింది. వయ్యారి భామ విత్తనాలు గాలిద్వారా సుమారు మూడు కిలోమీటర్ల వరకువ్యాపిస్తాయి.

● మనుషుల ఆరోగ్యంపై ప్రభావం..

వయ్యారిభామ మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రమాదకరమైన డర్మాటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఈ మొక్క ఆకులను చర్మానికి రాస్తే తామర వస్తుంది. ఈ పూల పుప్పొడితో జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పలు వాపు వస్తాయి. జంతువులు మేసినప్పుడు వెంట్రుకలు రాలిపోవడం, హైపర్ టెన్షన్ పెరుగుతుంది.. పశువుల పాల ఉత్పత్తి తగ్గి, జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. వయ్యారిభామ మొక్కను తిన్న పశువుల జీర్ణక్రియ, కిడ్నీ, కాలేయం, అన్నవాహిక, శ్వాసనాళం దెబ్బతినే ప్రమాదముంది. పొలాల్లో పని చేసిన రైతులు, కూలీలకు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చేఅవకాశముంది.

నివారణ ఇలా.. : ఏ స్రవంతి, ఏవో, దిలావర్‌పూర్



పంటచేలల్లో వయ్యారిభామ విస్తరించకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలి. మెట్టభూముల్లో పూతకుముందే మొక్కలను పీకేసి, తగులబెట్టాలి. అప్పుడు వచ్చే పొగ ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది కనుక దూరంగా ఉండాలి. బురద నేలల్లో లోపలకు తొక్కేయాలి. అప్పుడది ఎరువుగా మారే అవకాశముంది. ఈ వయ్యారిభామను నిలువరించే శక్తి కేవలం తంగేడు మొక్కకు మాత్రమే ఉంది. అందువల్ల పొలాల గట్లు, బంజరు భూముల్లో తంగేడు చెట్లను తొలగించవద్దు. ఈ కలుపు మొక్క పూతకు రాక ముందే 10 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.



క్యూ కాంప్లెక్స్ లేకపోవడంతో ఒకేసారి ఆలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు (ఫైల్)

సమస్యల ఒడిలో చదువులమ్మ గుడి!

● బాసర పుణ్యక్షేత్రంలో కనీస వసతులు కరువు ● చిన్నారులతో భక్తుల నానాపాట్లు ● కాగితాలకే పరిమితమైన మాస్టర్ ప్లాన్ ● అభివృద్ధికి నోచుకోని అరుదైన దేవాలయం

బాసర : బాసరలోని జ్ఞానసరస్వతీ ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో అల్లాడుతున్నది. రాష్ట్రానికే తలమానికమైన ఈ చదువులమ్మ గుడిలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో తెలంగాణ నలుమూలల నుంచేగాక వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులు నానాపాట్లు పడుతున్నారు. మరోవైపు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు రూపొందిన మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. 'ఇదిగో.. అదిగో' అంటూ అధికార పార్టీ నేతలు ఊరిస్తున్న 'ముఖ్యమంత్రి పర్యటన'నకు అతీగతీ లేకుండా పోయింది.

● అడుగడుగునా నరకం..

సాధారణ రోజుల్లో సుమారు 10 వేల మంది భక్తులకు తగ్గకుండా అమ్మవారిని దర్శించుకుంటారు. అక్షరశ్రీకార పూజలకు శుభముహూర్తాలు ఉన్న రోజుల్లో, వేసవి పరీక్షా సమయాల్లో, ఉత్సవాల్లో భక్తులరద్దీ అధికంగా ఉంటుంది. కానీ కనీస వసతులు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ ప్రాంగణం ఇరుకుగా ఉండడం, క్యూ కాంప్లెక్స్ లేకపోవడం, ప్రత్యేక అక్షర శ్రీకార మండపం చిన్నదిగా ఉండడం, భక్తుల విశ్రాంతి కోసం, విడిది కోసం గదులు లేకపోవడంతో నానాపాట్లు పడుతున్నారు. కనీసం ఆలయం వద్ద మరుగుదొడ్లు, మూత్రశాలలు, బస్టాండ్ లాంటివి లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. దేవస్థానం పరిధిలో 90 గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని వీఐపీలకు, పరిచయస్తులకే కేటాయిస్తున్నారు. పదిహేనేళ్ల కిందట చేసిన అభివృద్ధి పనులే తప్ప పెరుగుతున్న భక్తుల రద్దీకనుగుణంగా వసతులు ఏర్పాటుచేయకపోవడం వల్లే నానా సమస్యలు వస్తున్నాయి. ఉత్సవాలు, రద్దీ సమయంలో తాగునీరు, మరుగుదొడ్లు, కనీసం కూర్చునే సౌకర్యం లేని క్యూ లైన్లలో భక్తులు గంటల తరబడి వేచిచూస్తూ నరకం అనుభవిస్తున్నారు. చిన్నపిల్లలతో వారు పడే బాధలు వర్ణనాతీతం. గత ఫిబ్రవరిలో వసంతపంచమి వేడుకల సందర్భంగా భక్తులు ఇబ్బందులు భరించలేక ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



బాసర సరస్వతీ దేవాలయం

రద్దీ దినాల్లో భక్తుల పరిస్థితి ఇది (ఫైల్)



పిల్లా పాపలతో భక్తుల కష్టాలు (ఫైల్)

● సీఎం పర్యటనపైనే ఆశలు..

జిల్లాకు చెందిన దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండేళ్ల కింద అధికారులు ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఇందుకు రూ. 126 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో పాటు గతేడాది సెప్టెంబర్ 20న యాదాద్రి ఆలయ ప్రణాళికను రూపొందించిన ఆనందసాయి నేతృత్వంలో ఇంజనీర్ల బృందం బాసరను సందర్శించింది. ఈ సందర్భంగా ఆలయం అంతా తిరిగి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని పూర్తిగా విస్తరించాలని సూచించారు. మరోసారి సందర్శించి ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బాసర అభివృద్ధిపై అడుగు ముందుకు పడలేదు. మూడేళ్ల నుంచి బాసరకు ముఖ్యమంత్రి వస్తారంటూ అధికార పార్టీ నేతలు ప్రకటిస్తూనే ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటనపై స్థానికులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఆయన వస్తే ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.

● అక్కడ అలా.. ఇక్కడ ఇలా

విభజన అనంతరం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సరస్వతి ఆలయం లేకపోవడంతో అక్కడి ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లతో గోదావరి తీరంలో రాజమండ్రి వద్ద పెద్ద సరస్వతి ఆలయాన్ని నిర్మిస్తున్నది. ఇప్పటికే అక్కడి పండితులు బాసరకు వచ్చి ఇక్కడి ఆలయ నమూనా, ప్రతిరోజూ నిర్వహించే పూజల వివరాలను తెలుసుకొని వెళ్లారు. కానీ మన రాష్ట్రంలో ఈ ప్రాచీన ఆలయం అభివృద్ధిపై ఇక్కడి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయింది.

యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలి : శ్రీనివాస్‌యాదవ్, బాసర



రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవతో యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నది. వాటి తరహాలోనే బాసర సరస్వతీ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేయాలి. వచ్చిన భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలి.

దేవాలయ ప్రాముఖ్యతను గుర్తించాలి

- ఓంకార్, బాసర



బాసర సరస్వతీ దేవాలయం దేశంలోనే రెండో అతిపెద్దది. ఇలాంటి దేవాలయం తెలంగాణలో ఉండడం మనకు గర్వకారణం. అందువల్ల ఈ ఆలయ ప్రాముఖ్యతను గుర్తించి, అన్నివిధాలా అభివృద్ధి చేయాలి.

ఇదో 'హరిత' ఠాణా!

● నందనవనంలా ఈసుగాం పోలీస్‌స్టేషన్
● పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం

కాగజ్‌నగర్ రూరల్ : చుట్టూ పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆ పోలీస్ స్టేషన్ నందనవనాన్ని తలపిస్తున్నది. పోలీసుల ప్రత్యేక శ్రద్ధతో ఠాణా చుట్టూ పచ్చదనం పరుచుకోగా, ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది.



పూల మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈసుగాం పోలీస్ స్టేషన్



ఈసుగాం పోలీస్ స్టేషన్

ఈసుగాం పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టగానే పచ్చనిచెట్లు, పూల మొక్కలు స్వాగతం పలుకుతాయి. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సైలతో పాటు ప్రస్తుత ఎస్సై సుధాకర్ ప్రత్యేక శ్రద్ధతో ఆవరణంతా పచ్చదనంతో కళకళలాడుతున్నది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో ఇక్కడి పోలీసులు మొదటి నుంచీ చురుగ్గా పాల్గొంటున్నారు. పోలీస్‌శాఖ ద్వారా చుట్టుపక్కల గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేయడమేగాక మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. పంచగా మిగిలిన మొక్కలను ఠాణా ఆవరణలో నాటి, సంరక్షిస్తున్నారు.

రోజూ పోలీసులే ఉదయం, సాయంత్రం మొక్కలకు నీళ్లు పోస్తూ, కలుపు తీస్తున్నారు. ప్రస్తుతం ఠాణా ఆవరణలో గులాబీ, మల్లె, కనకాంబరం, లిల్లీలాంటి పూలమొక్కలతో పాటు వివిధ అలంకరణ మొక్కలు, సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్నాయి. వేప, జామ, మామిడి, మునగ, నిమ్మ, దానిమ్మ పండ్ల చెట్లు కూడా ఏపుగా పెరిగి, చల్లని నీడనిస్తున్నాయి.

మొక్కలంటే చాలా ఇష్టం..

- సుధాకర్, ఎస్సై, ఈసుగాం



నాకు మొక్కలంటే చాలా ఇష్టం. నాటడం, పెంచడం హాబీ. ఠాణా పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడ కనిపించిన మొక్కలను ప్రత్యేకంగా తెప్పించి, సిబ్బందితో కలిసి ఆవరణలో నాటుతున్నాం. సిబ్బంది కూడా మొక్కల పెంపకంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వివిధ ఫిర్యాదుల కోసం వచ్చేవారు చెట్ల కింద సేదదీరుతున్నారు.

ఆహ్లాదకర వాతావరణం

- రాకేష్ మండల్, నజ్రుల్‌నగర్



పోలీస్‌స్టేషన్‌లో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు పెంచడం వెనుక పోలీసుల కృషి ఎంతో ఉంది. ఇలాంటి ఠాణాను చుట్టుపక్కల మండలాల్లో చూడలేదు. ఈ పోలీస్‌స్టేషన్‌కు వెళితే అక్కడే కాసేపు ఉండిపోవాలనిపిస్తుంది.



ఈసుగాం పోలీస్ స్టేషన్‌లో పెంచిన వివిధ రకాల పూలు, అలంకరణ మొక్కలు

సూక్తి

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- సర్వేపల్లి రాధాకృష్ణ

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మీ ఇంట్లో దొంగలు పడ్డారట కదా నిజమేనా!

వెంగళప్ప : అవును

టీచర్ : వాళ్లను చూసి నువ్వు భయంతో దాక్కున్నావట కదా.

వెంగళప్ప : నేను భయంతో దాక్కోలేదు.

టీచర్ : మరి!

వెంగళప్ప : మా ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడం మూలంగా దొంగలకు ముఖం చూపించడానికి సిగ్గేసింది.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియలం ▸ ....
2. ప్రయంళ ▸ ....
3. నయంన ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

కొంటె ప్రశ్న

సముద్రం మధ్యలో ఏముంటుంది?

చుక్కలు కలపండి



టంగ్‌ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.



10,000 ఆమ్లెట్ ఫెస్టివల్

ఇంట్లో ఆమ్లెట్ రుచి చూడటం అందరూ చేసేదే. హోటల్‌కెళ్తే డబల్ ఎగ్ ఆమ్లెట్‌ను ఆర్డర్ చేస్తాం. కానీ ఏకంగా పది వేల కోడిగుడ్లతో ఆమ్లెట్ వేయడం ఎక్కడైనా చూశారా? బెల్జియంలోని మాల్‌మెడి పట్టణంలో నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవంలో అలా ఆమ్లెట్ వేశారు. కోడిగుడ్లలో ఫిప్రోనిల్ అనే విషపదార్థం ఉందంటూ వార్తలు రావడంతో ఆ భయాన్ని పోగొట్టేందుకు ఈ ఆమ్లెట్ ఉత్సవాన్ని నిర్వహించారు.

రోజూ గుడ్డు తినండి. ఆరోగ్యంగా ఉండండి అని టీవీల్లో చూస్తుంటాం. డాక్టర్లు సైతం కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. అయితే యూరప్ దేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో కోడిగుడ్లలో ప్రమాదకరమైన ఫిప్రోనిల్ అనే ఇన్‌సెక్టిసైడ్(పురుగులను చంపే రసాయన పదార్థం) ఉన్నట్లు తేలిందని వార్తలు వెలువడ్డాయి. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అలర్ట్ సిస్టమ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. బెల్జియంతో పాటు నెదర్లాండ్, జర్మనీ వంటి దాదాపు 18 దేశాల్లో ఈ రకమైన రసాయనం ఉన్న గుడ్లు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇది ఆ నోట ఈ నోట జనాల్లోకి పాకిపోయింది. దాంతో ప్రజలు గుడ్లు తినడం మానేశారు. అయితే యూరప్



దేశాల్లో ఉత్పత్తి అయ్యే గుడ్లతో ఎలాంటి ప్రమాదం లేదని, హాంకాంగ్ నుంచి కల్తీ గుడ్లు వచ్చి చేరాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ప్రజలు కొన్ని లక్షల గుడ్లను నాశనం చేశారు. ఫిప్రోనిల్ ఉండే అవకాశం ఉన్న గుడ్లన్నింటినీ సూపర్‌మార్కెట్లలో నుంచి తొలగించారు. ఈ దెబ్బకు దాదాపు 180 పౌల్ట్రీ పరిశ్రమలు మూతపడ్డాయి.

ఆమ్లెట్ ఫెస్టివల్‌తో మళ్లీ కళకళ

